
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 22-1-2021 ₹ 15/-



## మయన్మార్ సైన్యంతో లావాదేవీలు



మానవాభివృద్ధి మాటేమిటి?



అన్యాయాలపై ఎంపీజే పోరుబాట

# గీటురాయి

సమాజసేవ భావనల పాపురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in



సంపుటి 43 సంచిక: 4 హైదరాబాద్
శుక్రవారం 22 జనవరి 2021 రూ.15-00
8 జమాదల్ ఆఖిర్ 1442 హి|జ్రీ


**తొలిగీటు**

**సంతోషంలోనూ, కోపంలోనూ న్యాయమే మాట్లాడాలి, సత్యమే పలకాలి.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్

అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్

సబ్ ఎడిటర్
యాఖూబ్ షర్ఫీ

గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015

సేల్స్ మేనేజర్
ముహమ్మద్ యాసీన్, 9700255736

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





## లోపల...


| | | |
|---|---|---|
| పేరుమార్పు రాజకీయం | ...... | 05 |
| మయన్మార్ సైన్యంతో లావాదేవీలు | ...... | 06 |
| ఆర్థికాభివృద్ధి సరే... మానవాభివృద్ధి మాటేమిటి? | ...... | 08 |
| చరితార్థులు - మొహమ్మద్ ఆసిఫ్ అలీ | ...... | 13 |
| విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (ర.అ) – 30 | ...... | 14 |
| మోడల్... రోల్ మోడల్‌గా మారింది | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| అన్యాయాలపై ఎంపీజే పోరుబాట | ...... | 20 |
| చపాతి అంటే ఏమిటి? | ...... | 22 |
| అలా అడగొద్దు! | ..... | 23 |
| అన్నదాత సుఖీభవ! | ...... | 24 |
| ఇది కూడా లోభత్వమే | ...... | 26 |
| బిజెపి నేత విడాకుల బెదిరింపు | ...... | 27 |
| సైన్స్ – మతం | ...... | 28 |
| అసలైన జీవితం ఏది? | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


### గుళ్ళ రాజకీయం..



నడుస్తోంది ఏపీలో
విధ్వంస రాజకీయం
ఎవరి మెప్పుకోసమో
దేవుళ్ళ నాటకీయం !

పిచ్చోళ్ళుకాదు జనం
సాగనీయరట ఆట
ఉన్మాదపు గాళ్ళకు
వలుస్తరంట తాట !!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఉజ్వల తారలు గ్రంథం రూపంలో వెలువడిందన్న వార్త సంతోషాన్ని కలిగించింది. గీటురాయిలో ప్రతీవారం వచ్చే ఆ సీరియల్ క్రమం తప్పకుండా చదివేవారము. ఈ సీరియల్ పుస్తకరూపంలో వస్తే బాగుండును అనుకునేవాణ్ని. ఉజ్వల తారలు పుస్తకాన్ని తెప్పించుకుని చదువుతున్నాను. ధన్యవాదాలు.

**- ఖాజా అహ్మద్, కలిగిరి, నెల్లూరు జిల్లా**

కుటుంబాన్ని కాపాడుకుంటేనే సమాజం బాగుంటుంది. సమాజం బాగుంటేనే దేశం బాగుంటుంది. కుటుంబ వ్యవస్థ క్షీణిస్తే కలిగే పర్యవసానాలను మనం ఇప్పుడు కళ్లారా చూస్తున్నాము. 'బలమైన కుటుంబం-బలమైన దేశం' అంశంపై ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నారన్న ప్రకటన స్వాగతించదగ్గది. నేటి ఆధునిక పోకడలు మన ఫ్యామిలీ లైఫ్‌ను నిర్వీర్యం చేస్తున్నాయి. 'మీరు పరస్పరం సంబంధాలు తెంచుకోకండి...' అంటూ తొలిగీటులో ఇచ్చిన ప్రవక్త ప్రవచనం మన కుటుంబ వ్యవస్థ నిర్మాణానికి నాందీవచనం.

**- రేష్మా, ఖమ్మం**

మెటర్నిటీ దవాఖాన కథ ఆద్యంతం చదివించింది. ఒక గర్భిణీ మగ డాక్టర్‌తో ప్రసవం చేయించుకునేందుకు బిడియంతో ప్రాణాలను కోల్పోవడం, దీనికి చలించి ఓ పెద్దాయన మహిళల చేత, మహిళల కోసం ఆసుపత్రిని స్థాపించడం చదువుతుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. చక్కటి కథను అందించిన సమద్ గారికి షుక్రియా.

**- బషీరున్నీసా బేగం, పిడుగురాళ్ల**

'దీపమున్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలి' వ్యాసం సమయం విలువను తెలియజేసింది. మనిషి జీవితంలో యవ్వన కాలాన్ని సద్వినియోగం చేసుకున్నవారే చరితార్థులుగా మిగిలిపోతారు. యవ్వనంలో మనిషి చేసే దైవారాధనలకు అల్లాహ్ దగ్గర ఎంతో విలువ ఉంటుందన్న విషయం మా కళ్లు తెరిపించింది. మంగళగిరి జీలానీ గారికి షుక్రియా. 'కేలండరు మారింది.. జీవితం మారిందా?' అన్న వ్యాసం ఆత్మపరిశీలన చేసుకునేందుకు ప్రేరేపించింది. నశీరాబేగం వ్యాసాలు ధార్మిక చైతన్యాన్ని పెంచుతున్నాయి. విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా సీరియల్ కోసం ప్రతీవారం ఎదురు చూస్తుంటాము.

**- షెహ్‌నాజ్, అనంతపురం**

కంటి చూపు గురించి గతవారం నూర్‌బాషా రహ్మతుల్లాహ్ గారు చెప్పిన సూచనలు బాగున్నాయి. కంటి వెలుగు లేకపోతే లోకమంతా అంధకారమే. కళ్లులేని వారిని చూస్తే తెలుస్తుంది చీకటి ఎంత భయంకరంగా ఉంటుందో. వ్యాసం చదువుతున్నంత సేపూ చూసే శక్తిని ప్రసాదించిన ఆ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నాము. అదే వ్యాసంలో ఏం చూడకూడదో చెప్పిన విషయాలు ఆలోచింపజేశాయి. **- సల్మా హుమేరా, ఏలూరు**

ఓ ముస్లిమ్ యూనివర్శిటీ. కొంతమంది ముస్లిమ్ విద్యార్థులు ముహమ్మద్ ప్రవక్త పవిత్ర జీవితాన్ని పరిచయం చేసేందుకు యూనివర్శిటీలో చిన్నపాటి సమావేశం నిర్వహించాలని ప్లాన్ చేశారు. ప్రవక్త జీవిత ఆదర్శాలను తమ తోటి హిందూ, క్రైస్తవ విద్యార్థులకు తెలియజెప్పాలన్నది ఆ సమావేశం ఉద్దేశం. ప్రసంగించేందుకు అదే యూనివర్శిటీ ప్రొఫెసర్‌ను ఆహ్వానించారు. కానీ యూనివర్శిటీలో యాజమాన్యం నుంచి సమావేశానికి అనుమతి లభించలేదు. చేసేదేమీలేక సమావేశ వేదికను యూనివర్శిటీ పార్కులోకి మార్చారు. విద్యార్థులంతా పచ్చిక బయళ్లలో కూర్చున్నారు. ప్రొఫెసర్ గారికి ఒక కుర్చీవేశారు. అంతలోనే యూనివర్శిటీ గార్డు కూర్చోడానికి కుర్చీ కూడా లేకుండా తీసుకెళ్లబోయాడు. దీంతో విద్యార్థుల కోపం కట్టలు తెంచుకుంది. గార్డుతో గొడవకు దిగారు. అంతలోనే ప్రొఫెసర్ గారు సర్దిచెప్పి గార్డును అక్కడి నుంచి పంపించి వేశారు. 'మనం ఈరోజు మాట్లాడుకునే వ్యక్తి జీవితానికి కుర్చీకి సంబంధం లేదు. నేను ఈ ఫౌంటైన్ అరుగుపైన్నే కూర్చొని మీతో మాట్లాడతాను' అని చెప్పడంతో విద్యార్థులు శాంతించారు. ప్రవక్త జీవితంలోని ఎన్నో స్ఫూర్తిదాయకమైన అంశాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఆ యూనివర్శిటీ పేరు జామియా మిల్లియా. ఆ ప్రొఫెసర్ పేరు డాక్టర్ ముహమ్మద్ రఫత్. గొప్ప మేధావి, ఇస్లామిక్ స్కాలర్, సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా ఆయన ఇస్లామ్ ధర్మానికి, ముస్లిమ్ సమాజానికి విశేష సేవలందించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జనవరి 9, శనివారం ఢిల్లీలో కన్నుమూశారు. డాక్టర్ రఫత్ అందించిన సేవలను కొనియాడుతూ పలువురు మేధావులు సోషల్ మీడియాలో వ్యాసాలను రాశారు. ఆయన మరణం ముస్లిమ్ సమాజానికి తీరని లోటని అన్నారు.

**- జానిమియా, నల్గొండ**

# ఆలోచన

# పేరుమార్పు రాజకీయం

**ఇప్పుడు** ఔరంగాబాద్‌లో పేరు మార్పు రాజకీయం మొదలైంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పట్టణాలు, నగరాలకు పేరు మార్చడం ప్రధానమైన ప్రజాసేవగా మారిపోయింది. వరుసగా అనేక పట్టణాల పేర్లు మార్చే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇప్పుడు ఔరంగాబాద్ పేరు మరోసారి ముందుకు వచ్చింది.

ఇంతకు ముందు 1988లో ఔరంగాబాద్ స్థానిక ఎన్నికల్లో శివసేన అతిపెద్ద పార్టీగా గెలిచింది. ఔరంగాబాద్‌లో శివసేన అతిపెద్ద పార్టీగా గెలవడం అదే మొదటిసారి. కాని ఈ ఎన్నికల తర్వాత అల్లర్లు చెలరేగాయి. శివసేన విజయోత్సవ ర్యాలీలో హింసా కాండ చోటు చేసుకుంది. శివసేన అధిపతిగా బాల్ థాక్రే అప్పట్లో ఔరంగాబాద్ పేరు మార్చేస్తామని ప్రకటించాడు. ఔరంగాబాద్‌కు ఆ పేరు ముగల్ చక్రవర్తి ఔరంగజేబ్ వల్ల వచ్చింది. ఆ పేరు మార్చి మరాఠా ఛత్రపతి శంభాజీ పేరుతో శంభాజీ నగర్ పెడతామని బాల్ థాక్రే అన్నారు. ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ. ఔరంగాబాద్‌కు ఆ పేరు పెడతామని చెప్పడంలో శివసేనను ఔరంగాబాద్‌లో పటిష్టం చేయాలనే వ్యూహం ఉంది.

కాని అప్పట్లో ఈ పని జరగలేదు. ముప్పయి మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు మళ్ళీ ఔరంగాబాద్ పేరు మార్పు చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ఇప్పుడు మళ్ళీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఔరంగాబాద్ స్థానిక ఎన్నికలు వచ్చే నెలలో జరుగుతాయి. బాల్ థాక్రే అప్పట్లో చెప్పినట్లు ఔరంగాబాద్ పేరు మార్చుతామని ఇప్పుడు అంటున్నారు. బాల్ థాక్రే కుమారుడు ఉద్ధవ్ థాక్రే ఇప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి కాబట్టి పేరుమార్పు ఇప్పుడు పెద్ద కష్టం కాదు. కాని మహారాష్ట్రలో శివసేన ఒక్కటే అధికారంలో లేదు. కాంగ్రెసు పార్టీతో కలిసి మహావికాస్ అగాధీ సంకీర్ణం అధికారంలో ఉంది. ఔరంగాబాద్‌లో ఇప్పుడు మజ్లిస్ పార్టీ ప్రభావం పెరుగుతోంది. మజ్లిస్ పార్టీ కాంగ్రెస్ ఓటు బ్యాంకుకే గండి కొడుతుంది. ఔరంగాబాద్ పేరు మార్పును అడ్డుకోకపోతే ముస్లిం ఓట్లు కోల్పోతామని కాంగ్రెసు భయపడుతోంది. మజ్లిస్ ఈ పేరు మార్పును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ముస్లిములను ఆకట్టుకునే ప్రయత్నం అప్పుడే ప్రారంభించింది. శివసేన పేరు మార్చుతామంటూ హిందూ ఓట్లను ఆకట్టుకునే ప్రయత్నాల్లో ఉంది. ఇంతవరకు ఇలాంటి పేరుమార్పులు చేసింది బీజేపీ ప్రభుత్వాలే. బీజేపీకి ఒకప్పుడు శివసేన మిత్రపక్షం. కాని బీజేపీకి మిత్రపక్షంగా ఉంటే మహారాష్ట్రలో తమ ఉనికికే ప్రమాదం అని గ్రహించిన ఉద్ధవ్ థాక్రే బీజేపికి దూరమయ్యారు. కాని శివసేన ఓటు బ్యాంకుకు బీజేపీ గండి కొట్టకుండా కాపాడుకోవాలంటే హిందూ ఓట్లను ఆకట్టుకునే ప్రయత్నాలు తప్పవు. కాబట్టి శివసేన ఔరంగాబాద్ పేరు మార్పు విషయంలో వెనక్కి తగ్గడం లేదు. క్లుప్తంగా చెప్పాలంటే, శివసేన ఓటు బ్యాంకును బీజేపి నుంచి కాపాడుకోవాలంటే ఔరంగాబాద్ పేరు మార్పు రాజకీయం శివసేనకు అవసరం. కాంగ్రెస్ ఓటు బ్యాంకును మజ్లిస్ దెబ్బతీయకుండా ఉండాలంటే శివసేనను ఈ విషయంలో వ్యతిరేకించి, ఔరంగాబాద్ పేరుమార్పును వ్యతిరేకించడం కాంగ్రెస్ రాజకీయ అవసరం. ఏది ఏమైనా ఇప్పుడు ప్రజాసేవ పేరు మార్పుల తతంగంగా మారింది.

శివసేన, కాంగ్రెస్ రెండు పార్టీలు కలిసి సంకీర్ణాన్ని నడుపుతున్నాయి. కాబట్టి ఈ వ్యవహారం సంకీర్ణ ప్రభుత్వంపై ఎంత ప్రభావం వేస్తుందన్నది చూడాలి. అలాగే ఔరంగాబాద్‌లో విమానాశ్రయం పేరు మార్చి ఛత్రపతి శంభాజీ ఎయిర్ పోర్టు పెట్టాలని కేంద్రానికి ఉద్ధవ్ థాక్రే లేఖ రాశారు.

మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయే ప్రమాదం ఉందా? ఈ లెక్కలన్నీ ఉద్ధవ్ థాక్రే వేసుకున్నారు. మహారాష్ట్రలో ముంబయి, థానేల తర్వాత ముఖ్యమైన పట్టణం ఔరంగాబాద్. ఔరంగాబాద్‌లో 68.8 శాతం హిందువులు, 21.3 శాతం ముస్లిములున్నారు. హిందూ ముస్లిం రాజకీయాలు నడపడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవచ్చని భావిస్తున్నారు. ఔరంగాబాద్‌లో రాజకీయంగా ఎదగడానికి శివసేన ఇప్పటి వరకు చేస్తూ వచ్చిన పని ఇదే. కాని ఇప్పుడు శివసేనకు బిజేపీ నుంచే ప్రమాదం వస్తోంది. శివసేన ఓట్లను బీజేపీ కొల్లగొట్టే అవకాశాలు పెరిగాయి. మరోవైపు మజ్లిస్ పార్టీ బలం పెంచుకుంది.

బీజేపీని నిలువరించడానికి శివసేన పేరుమార్పు అంశాన్ని తెరపైకి తెచ్చింది. మజ్లిస్‌ను నిలువరించడానికి కాంగ్రెస్ అభ్యంతరాలు చెబుతోంది. ఏది ఏమైనా దేశంలో ఇప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడడం రాజకీయంగా లాభసాటి కాదు, మత పరమైన మనోభావాలతో ఆడుకోవడమే రాజకీయంగా స్థిరపడింది. ✤

**కవరు కథనం**

అబ్దుల్ వాహెద్



# మయన్మార్ సైన్యంతో లావాదేవీలు

**ఐదు దశాబ్దాల** మయన్మార్ చరిత్రలో అధికకాలం సైనిక పరిపాలనలోనే గడిచింది. సైన్యం తప్పుకుని ప్రజాస్వామ్యం స్థిరపడడం అనేది ఇంకా పూర్తికాలేదనే చెప్పాలి. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. సైనిక ప్రభుత్వం 2010లో లాంఛనంగా రద్దయ్యింది. అంగ్ సన్ సూకీతో సహా రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. ప్రజాస్వామిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. నేషనల్ లీగ్ డెమొక్రసీ 2015లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మయన్మార్‌లో సర్వాధికారాలు చెలాయించిన సైన్యాన్ని అక్కడి భాషలో అధికారికంగా తాత్మాదో అని పిలుస్తారు.

ఇప్పుడు కూడా దాదాపు పాతిక శాతం పార్లమెంటు స్థానాలు మిలిటరీ ప్రతినిధులకు కేటాయించబడి ఉన్నాయి. అంతేకాదు మయన్మార్‌లోని భారీ వాణిజ్య సంస్థలు సైనికాధికారుల చేతుల్లోనే ఉన్నాయి. సైనిక పరిపాలన ఉన్న దేశాల్లో లేదా సైన్యం పరిపాలనలో జోక్యం చేసుకునే దేశాలన్నింటా ఈ పరిస్థితి కనిపిస్తుంది. వాణిజ్య పారిశ్రామిక సంస్థలను సైనికాధికారులు తమ చేతుల్లో ఉంచుకుంటారు. మయన్మార్‌లోను ఈ పరిస్థితి కనిపిస్తుంది. భారీ వాణిజ్య సంస్థలు సైన్యం చెప్పుచేతల్లో ఉన్నాయి. సుదీర్ఘకాలంగా అవినీతి, క్రోనీ కేపిటలిజాలతో అనేకమంది సైన్యాధికారులు అపార సంపద కూడబెట్టుకున్నారు. బలమైన ఆర్థిక శక్తిగా సైన్యం మయన్మార్‌లో పెత్తనం చెలాయిస్తుంది.

సైనిక పాలన ఉన్న కాలంలో మయన్మార్‌పై అనేక అంతర్జాతీయ ఆంక్షలు ఉండేవి. సైనిక పరిపాలనను రద్దుచేసిన తర్వాత ఈ ఆంక్షలను ఎత్తేసారు. కాని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల సంఘం మయన్మార్ సైన్యం ప్రమేయమున్న కంపెనీలతో ఎవరూ వాణిజ్యం చేయరాదని సూచించింది. మయన్మార్ సైన్యంపై మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి వస్తున్న ఆరోపణల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.

కాని గత కొన్ని నెలలుగా వస్తున్న వార్తలను చూస్తే విదేశీ కంపెనీలు మయన్మార్ సైన్యంతో సంతోషంగా లావాదేవీలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు బ్రిటీషు బ్యాంకులు HSBC, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులు ఒక వియత్నాం కంపెనీకి మయన్మార్‌లో మొబైల్ నెట్వర్క్ నిర్మించడానికి 60 మిలియన్

డాలర్ల రుణం ఇచ్చాయి. మయన్మార్ సైన్యం నియంత్రణలో ఉన్న మయన్మార్ ఎకనమిక్ కార్పోరేషనుకు ఇందులో 28 శాతం వాటా ఉంది. మైటెల్ పేరుతో ఈ కార్పోరేట్ నడుపుతున్నారు. ఈ కంపెనీతో ఇస్రాయిల్ టెక్నాలజీ కంపెనీ గిలాత్ శాటిలైట్స్ కూడా చాలా సంతోషంగా లావాదేవీలు కొనసాగిస్తోంది.

ఆస్ట్రేలియా ప్రభుత్వ వైఖరిని కూడా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం అన్యాపదేశంగా తప్పుపట్టింది. ఆస్ట్రేలియన్ ఫ్యూచర్ ఫండ్ దాదాపు 2.5 మిలియన్ డాలర్లను అదానీ గ్రూపు కంపెనీలో పెట్టుబడి పెట్టింది. ఈ కంపెనీ మయన్మార్ ఎకనమిక్ కార్పోరేషనుతో లావాదేవీలు కొనసాగిస్తోంది.

అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్స్ ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్‌లోని బొగ్గు గని నుంచి గ్రేట్ బారియర్ రీఫ్‌లోని ఒక ఓడరేవుకు రైల్వే లైను వేస్తోంది. ఇదే కంపెనీ మయన్మార్ ఎకనమిక్ కార్పోరేషను యాంగాంగ్‌లో మయన్మార్ ఎకనమిక్ కార్పోరేషను యాజమాన్యంలో ఉన్న భూమిపై కంటెనర్ పోర్టు నిర్మిస్తోంది.

మయన్మార్ సైన్యం ప్రమేయమున్న కంపెనీలతో లావాదేవీలు చేయరాదని ఐక్యరాజ్యసమితి పిలుపునివ్వడానికి గట్టి కారణాలున్నాయి. అరకాన్ ప్రాంతంలో 2016లో మయన్మార్ సైన్యం అమానుష దౌర్జన్యాలకు, హింసాకాండలకు పాల్పడింది. అరకాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ అనే వేర్పాటువాద సంస్థను అణిచివేసే నెపంతో రోహింగ్యాలపై అత్యంత క్రూరంగా హింసాకాండ అమలు చేసింది. రాఖినే రాష్ట్రంలో రోహింగ్యాలు అధిక సంఖ్యలో ఉన్నారు. రోహింగ్యాల భాష, సంస్కృతులు వేరుగా ఉంటాయి. మయన్మార్ సైన్యం పాల్పడిన అకృత్యాల వల్ల మానవ సంక్షోభం ఏర్పడింది. దాదాపు 350 రోహింగ్యా గ్రామాలను ధ్వంసం చేశారు. లక్షలాది మంది రోహింగ్యాలు ప్రాణాలు అరచేత పట్టుకుని మయన్మార్ వదిలి పొరుగున ఉన్న బంగ్లాదేశ్ పారిపోయారు. ఇప్పటికి కూడా లక్షలాది మంది రోహింగ్యాలు బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల్లో జీవిస్తున్నారు.

మయన్మార్ సైన్యంపై వచ్చిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి. మార్చి 2017లో ఐక్యరాజ్యసమితి ఈ ఆరోపణలపై విచారణకు స్వతంత్ర నిజనిర్ధారణ సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ సంఘంలో ఆస్ట్రేలియా మాజీ మానవహక్కుల కమీషనర్ క్రిస్ సిడోటీ, ఇండోనేషియా మాజీ ప్రాసిక్యూటర్ జనరల్ మర్జూకీ దరుష్మాన్, శ్రీలంక మానవ హక్కుల ప్రతినిధి రాధిక కుమార స్వామి ఉన్నారు.

ఈ నిజనిర్ధారణ సంఘం సెప్టెంబర్ 2018లో పూర్తి స్థాయి నివేదిక సమర్పించింది. ఆ నివేదికలో వేలాది రోహింగ్యాల అమానుష హత్యాకాండ, సామూహిక అత్యాచారాలు, గల్లంతైన అసంఖ్యాక అభాగ్యుల వివరాలు పేర్కొన్నారు. మయన్మార్ సైన్యం కమాండర్ ఇన్ చీఫ్, సీనియర్ జనరల్ మిన్ అంగ్ లాంగ్‌తో పాటు ఐదుగురు సైనిక ఉన్నతాధికారులను జాతినిర్మూలన నేరానికి విచారించాలని నిజనిర్ధారణ సంఘం పేర్కొంది.


సెప్టెంబర్ 2019లో ఐక్యరాజ్య సమితి నిజనిర్ధారణ సంఘం మయన్మార్ సైన్యం ఆర్థిక ప్రయోజనాలపై ఒక నివేదికను ప్రచురించింది. విదేశీ కంపెనీలు మయన్మార్ సైన్యంతో సంబంధమున్న కంపెనీలతో వ్యాపార లావాదేవీలు తెంచుకోవాలని పిలుపునిచ్చింది. ముఖ్యంగా మయన్మార్ ఎకనమిక్ కార్పోరేషన్, మయన్మార్ ఎకనమిక్ హోల్డింగ్ లిమిటెడ్ కంపెనీలను రిపోర్టులో ప్రస్తావించారు. సైన్యం అధీనంలో అనేక కంపెనీలు, అనేక పరిశ్రమలు ఉన్నాయి. మాన్యుఫాక్చరింగ్, నిర్మాణరంగం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక జోన్లు, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, టెలీ కమ్యునికేషన్స్, మైనింగ్ ఇలా అనేక రంగాల్లో సైన్యం వ్యాపారాలు చేస్తోంది. ఈ కంపెనీలన్నీ 2016లో పబ్లిక్ కంపెనీలుగా అవతరించాయి.

మయన్మార్ సైన్యం నిర్వహిస్తున్న కంపెనీలతో లావాదేవీలు జరుపుతున్న విదేశీ కంపెనీల పేర్లు కూడా రిపోర్టులో ప్రస్తావించారు. ఈ పేర్లలో అదానీ, కిరిన్ హోల్డింగ్స్ (జపాన్), పోస్కో స్టీల్ (దక్షిణ కొరియా), ఇన్ఫోసిస్ (ఇండియా), యూనివర్సల్ అప్పారెల్ (హాంకాంగ్) ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు, వివిధ దేశాల ప్రభుత్వాలు మయన్మార్ మిలిటరీపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయాలని రిపోర్టు పేర్కొంది.

గమనించవలసిన విషయమేమంటే, మయన్మార్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించాలని ఐక్యరాజ్య సమితి నివదిక సాధారణ పిలుపు ఇవ్వలేదు. మయన్మార్‌లో ఆర్థిక ప్రగతి వికాసాలకు పెట్టుబడులు పెట్టడాన్ని ఈ నివేదిక తప్పుపట్టడం లేదు, కాని మయన్మార్ మిలిటరీ ప్రమేయమున్న కంపెనీలతో లావాదేవీలు మానుకోవాలని చెప్పింది.

మయన్మార్‌కు సంబంధించి సాధారణ ఆర్థిక ప్రగతికి తోడ్పడడం, దాంతో పాటు మయన్మార్ సైన్యాన్ని దూరంగా ఉంచడం అనే విధానం అవలంబిస్తున్నారు. నిజానికి 2011 వరకు అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా మయన్మార్‌పై వాణిజ్య, దౌత్య ఆంక్షలు అమలు చేశాయి. కాని విదేశీ కంపెనీలు మయన్మార్‌తో లావాదేవీలు నిర్వహించడానికి ఏదో ఒక దారి వెదుక్కునేవి. ముఖ్యంగా పొరుగున ఉన్న దేశాల

**(మిగతా 9వ పేజీలో)**



# ఆర్థికాభివృద్ధి సరే... మానవాభివృద్ధి మాటేమిటి?

**పశ్చిమ బెంగాల్,** గుజరాత్ ఈ రెండు రాష్ట్రాలకు పోలిక లేదు. గుజరాత్ మోడల్ గురించి దేశమంతా చర్చ జరుగుతోంది. పశ్చిమ బెంగాల్ వెనుకబడిన రాష్ట్రం.

టాటా మోటార్స్ 2008లో నానో కార్లను పశ్చిమ బెంగాల్లో తయారు చేయాలనుకుంది. కాని భూసేకరణ విషయమై బెంగాల్లో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. విసిగిపోయిన టాటా కంపెనీ నానో మోటార్ల తయారీ ప్లాంట్‌ను గుజరాత్‌కు తరలించింది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ టాటా నానోకార్ల ఉత్పత్తి ప్లాంట్‌కు ఎలాంటి అడ్డంకులు లేకుండా తోడ్పడ్డారు. ఈ ఒక్క సంఘటన చాలు బెంగాల్, గుజరాత్ రెండింటి మధ్య తేడా అర్థం చేసుకోవచ్చు. గుజరాత్‌లో పారిశ్రామిక ప్రగతి ఉచ్ఛదశలో ఉంది. బెంగాల్లో పారిశ్రామిక ప్రగతి పాతాళంలో ఉంది. బెంగాల్ కన్నా గుజరాత్ ధనిక రాష్ట్రం.

కాని, విచిత్రమేమంటే, గుజరాత్‌లో పారిశ్రామిక సంపద చాలా ఉంది. కాని అది మానవాభివృద్ధి సూచికల్లో ఎక్కడా కనబడడం లేదు. ఇటీవల జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే డాటా వచ్చింది. ఈ డాటా ప్రకారం చూస్తే గుజరాత్‌లో పిల్లల కన్నా బెంగాల్లో పిల్లలు చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సర్వేలో 4 లక్షల కుటుంబాల నుంచి సమాచారం సేకరించారు. భారతదేశంలో ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో చెప్పే సమగ్రమైన సర్వే ఇది.

నవజాత శిశువుల్లో మరణాల రేటు బెంగాల్లో 15.5, గుజరాత్ లో 21.8. బెంగాల్లో 22, గుజరాత్‌లో 31.2. ఐదేళ్ల లోపు పిల్లల్లో మరణాల రేటు బెంగాల్లో 25.4, గుజరాత్ లో 37.6. ఐదేళ్ళ పిల్లల్లో ఎదుగుదల స్తంభించిన పిల్లల రేటు బెంగాల్లో 33.8, గుజరాత్‌లో 39. ఇంకా అనేక సూచికల్లోను బెంగాల్ చాలా మెరుగ్గా ఉంది.

మరో విచిత్రమేమంటే, గత రెండు దశాబ్దాలుగా గుజరాత్ మోడల్‌తో ఆకాశంలో దూసుకుపోతోంది. కాని మరోవైపు బెంగాల్‌కు, గుజరాత్‌కు మానవాభివృద్ధి సూచికల్లో తేడా కూడా పెరిగిపోతోంది. ఉదాహరణకు 1996లో 1000 ప్రసవాల్లో శిశు మరణాల రేటు గుజరాత్‌లో 63, బెంగాల్లో 58, రెండు రాష్ట్రాల మధ్య తేడా 5 పాయింట్లు. కాని ఈ తేడా 2020 వచ్చేసరికి 9 పాయింట్లకు పెరిగింది. ఈ రెండు దశాబ్దాల్లో గుజరాత్ ఆర్థికంగా బెంగాల్ కన్నా చాలా ఎక్కువగా అభివృద్ధి సాధించింది. కాని ఈ రెండు దశాబ్దాల్లో గుజరాత్ పిల్లల కన్నా బెంగాల్ పిల్లలు మరింత ఆరోగ్యవంతులుగా మారారు.

ఈ పరిస్థితికి కారణాలేమిటి? అనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. బెంగాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ చాలా మెరుగ్గా ఉంది. ప్రాథమిక, హైస్కూల్ స్థాయిలో బాలికల విద్యాభ్యాసం కూడా బెంగాల్లో చాలా మెరుగ్గా ఉంది. స్థానిక పరిపాలన పంచాయతీ వ్యవస్థ చాలా బలంగా ఉంది. దీనివల్లనే మానవాభివృద్ధి సూచికలు మెరుగ్గా ఉన్నయని కొందరి అభిప్రాయం.

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ఆహారధాన్యాలు అందుబాటులోకి వచ్చేలా చేయడం జరుగుతుంది. ఇది దేశవ్యాప్తంగా అమలవుతున్నదే. ప్రజాపంపిణీ వ్యవస్థ విషయంలో బెంగాల్ గతంలో వెనుకబడి ఉండేది. కాని ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రజాపంపిణీ విస్తరించేలా పటిష్ట మైన చర్యలు తీసుకుంది. అంతేకాదు, స్థానిక పరి పాలన, పంచాయతీ వ్యవస్థ విషయంలోను బెంగాల్లో చాలా బలంగా ఈ వ్యవస్థ పనిచేస్తోంది. పంచాయతీల ద్వారా స్థానిక పరిపాలన జరుగుతోంది. పెద్ద మొత్తాలు పంచాయతీల ద్వారా ఖర్చవుతున్నాయి. పంచాయతీ వ్యవస్థను మార్చే ప్రయత్నాలను బెంగాలీలు బలంగా అడ్డుకున్నారు.

ప్రజారోగ్యం పట్ల అక్కడి ప్రభుత్వాలు తీసుకున్న శ్రద్ధ కూడా ఒక కారణం. దేశంలో ఆసుపత్రి పడకలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో రెండవది బెంగాల్. ప్రతి 1000 మందికి 2.25 ఆసుపత్రి పడకలు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో బెంగాల్ కన్నా కాస్త పై స్థానంలో ఉంది సిక్కిం. అక్కడ 1000 మందికి 2.34 ఆసుపత్రి పడకలు అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో గుజరాత్‌తో పోలికే లేదు. గుజరాత్ కన్నా ఎనిమిది రెట్లు ఎక్కువ ఆసుపత్రి పడకలున్నాయి. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ పడకల విషయానికి వస్తే గుజరాత్ కన్నా నాలుగు రెట్లు ఎక్కువగా బెంగాల్లో ఉన్నాయి.

గుజరాత్ మోడల్ గురించి చాలా చర్చ జరిగింది. గుజరాత్ మోడల్‌లోని లొసుగులను అనేకమంది ఆర్థికవేత్తలు కూడా బయటపెట్టారు. ఆర్థికవేత్త జాన్ డ్రెజ్ ప్రకారం గుజరాత్ మోడల్ అనే బదులు గుజరాత్ పజిల్ అంటే బాగుంటుంది. ఎందుకంటే, అక్కడ ఆర్థికాభివృద్ధి అక్కడి మానవాభివృద్ధిలో కనబడడం లేదు. గుజరాత్ మానవాభివృద్ధి విషయంలో వెనుకబడడానికి కారణం సామాజిక, లైంగిక అసమానతలే అని కొందరు నిపుణుల అభిప్రాయం. మహిళల సాధికారత లోపిస్తే అక్కడ పిల్లల పోషకాహార లోపం కూడా ఉంటుంది. తల్లుల ఆరోగ్యం మెరుగ్గా లేకపోతే పిల్లల ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉండదు. గతంలో ఆర్థికవేత్త ఇందిరా హిర్వే గుజరాత్‌కు సంబంధించి ఈ విషయాలు రాశారు.

మరో ముఖ్యమైన విషయమేమంటే గుజరాత్ ప్రయివేటు రంగానికి అధిక ప్రాముఖ్యం ఇచ్చింది. మరోవైపు సంక్షేమ కార్యక్రమాలను తగ్గించింది. ఒకప్పుడు గుజరాత్‌లో చాలా బలమైన ప్రజాపంపిణీ వ్యవస్థ ఉండేది. మెరుగైన ప్రజారోగ్య వసతులు ఉండేవి. కాని ప్రయివేటైజేషన్, పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యాల వరదల్లో ఇవన్నీ కొట్టుకుపోయాయి. పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యం ఆరోగ్యం రంగంలో ప్రవేశించిన తర్వాత ఆరోగ్య సేవలు ప్రయివేటు ఆసుపత్రుల పరం చేయడం జరిగింది. ప్రయివేటు ఆసుపత్రులు ఆరోగ్య సేవలను లాభాపేక్షతో చేస్తాయే కాని ప్రజాసంక్షేమం అనే దృష్టి సహజంగానే ఉండదు.

ఏదిఏమైనా సంపన్న గుజరాత్‌లో పిల్లల ఆరోగ్యం తీసికట్టుగా ఉండడానికి కారణమేమిటి? పేద బెంగాల్లో పిల్లల ఆరోగ్యం మెరుగ్గా ఉండడానికి కారణమేమిటి? ఈ ప్రశ్నలపై ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ✦

## మయన్మార్ సైన్యంతో లావాదేవీలు (7వ పేజీ తరువాయి)

కంపెనీలు లావాదేవీలు మామూలుగానే కొనసాగిస్తూ వచ్చాయి. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే, మయన్మార్‌తో ఏ విధమైన వాణిజ్య లావాదేవీలైనా సరే మయన్మార్ సైన్యం ప్రమేయం లేకుండా సాధ్యమే కావు. అక్కడ భూమి, ఇతర వనరులు అనేక క్రోనీ కంపెనీల పేరుపై ఉన్నాయి. వాటన్నింటిని సైన్యమే అదుపు చేస్తోంది.

ఉదాహరణకు అదానీ గ్రూపు వాదన ఏమిటంటే, మయన్మార్ ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్నామన్నారు. ఆస్ట్రేలియాతో పాటు కొన్ని దేశాలు మయన్మార్‌కు ఆయుధాల అమ్మకాన్ని నిషేధించాయి. మయన్మార్ మిలిటరీ అధికారులు కొందరిపై ప్రయాణ నిషేధాలు విధించాయి. అయితే ఇది వాణిజ్య లావాదేవీలకు వర్తించదని, మయన్మార్ ఎకనమిక్ కార్పోరేషన్ వంటి కంపెనీలతో లావాదేవీలకు ఈ నిషేధాలేవీ వర్తించవని వాదిస్తున్నారు.

సింగపూరులో ఉన్న కంపెనీల ద్వారా సింగపూర్ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం మయన్మార్‌లో అదానీ పెట్టుబడులు, లావాదేవీలు ఉన్నాయి. కాని గమనించవలసిన విషయమేమంటే, మిలిటరీ ప్రమేయమున్న సంస్థలతో తప్పనిసరిగా వ్యాపారం చేయవలసిన అవసరం నేడు ఉందా? మరో దేశంలో ప్రత్యేక కంపెనీలు పెట్టడం ద్వారా పెట్టుబడులు వాటి ద్వారా మళ్ళించడం వంటి చర్యల ద్వారా నైతిక బాధ్యతను తప్పించుకోవడం సముచితం కాదు. ఊచకోతలు, అమానుష హత్యాకాండలకు పాల్పడిన మయన్మార్ సైన్యాధికారుల ఆర్థిక ప్రయోజనాలే ఈ లావాదేవీల్లో ఎక్కువగా ఉంటాయి.

రాఖినే రాష్ట్రంలో రోహింగ్యాలపై అణిచివేతలు, హింసాకాండల వెనుక కూడా మయన్మార్ సైన్యం ఆర్థిక ప్రయోజనాలున్నాయి. రాఖినే రాష్ట్రంలోని వనరులు, భూమి వారి ఆర్థిక ప్రయోజనాలకు కావాలి. అందుకే లక్షలాది రోహింగ్యాలు ఈ రాష్ట్రం వదిలి వెళ్ళేలా క్రూరమైన ఊచకోతలు కొనసాగించారు. ఇలాంటి దుర్మార్గులతో వ్యాపార లావాదేవీలు సముచితమా? అనేది ప్రతి కార్పోరేట్ కంపెనీ ఆలోచించుకోవలసిన సమయం ఆసన్నమయ్యింది. ✦


గీటురాయి వారపత్రిక

### ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




**నూర్ బాషా రహంతుల్లా**
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, 6301493266





# హైకోర్టుల్లోకి హిందీని రానివ్వలేదు

- దేశంలో భాషలు 1625
- 60 శాతం మందిది హిందీయేతర భాషే
- హిందీ మాట్లాడేది 40 శాతమే

**దేశంలో హిందీ** ధగధగలాడాలని, అది రాజభాషగా వెలుగు లీనాలని 'హిందీ దివస్' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేశానికి ఉమ్మడి భాష హిందీ అంటున్నారు. అప్పుడే మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ కన్న కలలు నెరవేరతాయట. తెలుగు గురించి మన రాయలవారు, గురజాడ, కందుకూరి, గిడుగు కూడా కలలు కన్నారు. దేశంలోని 1,625 భాషలకు దినాలు దివసాలు ఎవరు నిర్వహిస్తారు? దేశంలో 60 శాతం మంది హిందీయేతర భాషలు మాట్లాడుతుంటే 40 శాతం మంది మాట్లాడే హిందూస్థానీ (హిందీ)కి అగ్రాసనం వేశారు. హిందీ రాష్ట్రాల్లో కూడా బ్రజ్‌భాషా, ఛత్తీస్‌గఢీ, హర్యాన్వి, ఉరుదూ లాంటి 49 మాండలికాలు పలుకుబడులు ఉన్నాయి. 22 జాతీయ భాషలతోపాటు ఇంగ్లీష్ కూడా అధికార భాషే. హిందీని మిగతా భాషలపై రుద్ద వద్దని అన్ని రాష్ట్ర భాషలనూ బ్రతకనివ్వాలని హిందీయేతర భాషల నేతలు కోరితే ఆంగ్లం నుంచి హిందీకి మారే ప్రసక్తే లేదని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. అంబేడ్కర్ కూడా దేశీయ భాషల్ని రక్షించి అభివృద్ధి చేయమన్నారు. హిందీని ప్రజలందరి మీదా రుద్దమని ఇంగ్లీషే అనుసంధాన భాష అని రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్యనాయుడు అన్నారు. దేశ ప్రజలు కూడా మంచి ఉద్యోగాల కోసం అంతర్జాతీయ భాష ఇంగ్లీషును ఆశ్రయిస్తున్నారు. రాజభాషగా హిందీని కూడా అందరికీ నేర్పాలని పురుషోత్తందాస్ టాండన్, గుల్జారీలాల్ నందా, అమిత్ షా వరకు కోరుతూనే ఉన్నారు. అసలు హిందీ వాళ్ళు ఎప్పుడైనా మరో భారతీయ భాష నేర్చుకున్నారా? పరభాషా సహనం తెలుగువారికి ఎప్పుడూ ఎక్కువే.

## ఐరాసలో పీవీ హిందీ ప్రసంగం

ఐక్యరాజ్య సమితిలో హిందీలో మాట్లాడిన మొదటి తెలుగు వ్యక్తి పీవీ నరసింహారావు. ప్రణబ్ ముఖర్జీ తనకు హిందీ రాదు కాబట్టే ప్రధాని కాలేకపోయానని బాధపడ్డారు. ప్రభుత్వ సమాచారమంతా ఇంగ్లీషు హిందీలలోనే ఉంటుంది. అధికార కార్యకలాపాలన్నీ హిందీలో నడిపే సిబ్బందికి నగదు పారితోషికాలిస్తున్నారు. హిందీయేతర రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం ఇంగ్లీష్ మాధ్యమంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా హిందీ ప్రశ్నాపత్రం ఉండాలనే నియమాన్ని ఆనాడే రాజశేఖరరెడ్డి తోసిపుచ్చారు. హిందీ దేశ

ఉమ్మడి భాష కాదని ఎన్.జి. రంగా, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, కరుణానిధి లాంటి దక్షిణాది నాయకులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల్లో వాడే హిందీ సంస్కృత పదాలతో జటిలంగా, కృత్రిమంగా ఉంటున్నదని హిందీ వాళ్ళే ఆరోపి స్తున్నారు. ముందు సామాన్యులకు అర్థమయ్యేలా వాడుక పదాలు వాడమంటున్నారు.

## ప్రాంతీయ భాషలను విస్మరించి హిందీయా?

తెలుగు లాంటి ప్రాంతీయ భాషలు మరుగున పడిపోతున్నా సరే స్కూళ్ళలో హిందీని కచ్చితంగా బోధించాలని కస్తూరి రంగన్ కమిటీ సిఫార్సు. ఏమిటీ హిందీపెత్తనం? మొండిగా హిందీ తప్పదు అనటం ఉద్యమాలు తలెత్తితే అనలేదనటం కేంద్రానికి అలవాటుగా మారింది. ప్రజలు దేశంలో కాదు భాషలో నివసిస్తారని పెద్దలు అంటారు. తనపై మరో భాష పెత్తనాన్ని మనిషి సహించలేడు. ఇంగ్లీషు, హిందీవాళ్లు కూడా అంతే. వారిపై మరో భాష అధికారాన్నీ, ఆధిపత్యాన్నీ ఒప్పుకోరు. తమ భాషపై ప్రజలకుండే మక్కువ అలాంటిది. తెలుగు ఇప్పటికే సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషల కాళ్ళ కింద నలిగి నాశనమై పోయింది. ఆర్యులకు పూర్వమే సవర, కోయ భాషల్లో ఎన్నో తెలుగు పదాలు వున్నట్టు గిడుగు శ్రీ రామమూర్తి చెప్పారు. మన తెలుగు పదాలే మనకే తెలియకుండా పోయాయి. ఒక పక్క ఏ భాషనూ ప్రభుత్వం ప్రజలపై రుద్దకూడదు అంటూనే హిందీని ద్వితీయ భాషగానైనా నేర్చుకోవాలని చెబుతున్నారు. తెలుగు నేర్చుకోమని ఏ హిందీ రాష్ట్రానికైనా ఎప్పుడైనా చెప్పారా? దేశ ప్రజలందరినీ ఒకే దేశం ఒకే పౌరసత్వం కిందకు రాబట్ట గలము కానీ 1,625 భారత భాషలను హిందీ క్రిందకు తీసుకురాగలమా? ఒకే భాష అనటం సమంజసమా? సాధ్యమా? ఈ పని ఇంగ్లీషు వల్ల కూడా కాలేదు. కాబోదు. ప్రాంతీయ భాషలపై హిందీని ఉన్నత పీఠం ఎక్కించాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

## ఏ భాషకూ జాతీయ హెూదా లేదు

ఏ భాషకూ జాతీయ హెూదాను రాజ్యాంగం కట్టబెట్టలేదు. హిందీకి లిపికూడా లేదు. దేవనాగరి లిపిని కట్టబెట్టారు. హిందీ పట్ల మిగతా భాషల వాళ్ళకు వ్యతిరేకత పెరిగేలా హిందీ దివాసాలు దినాలు మాత్రం చేస్తున్నారు. 1938లో రాజగోపాలాచారి మద్రాసులో హిందీని తప్పనిసరి సబ్జెక్టుగా చేసి వల్లగాక 1940లో ఉపసంహరించుకున్నారు. ఈసారి కేంద్ర నాయకులు రంగంలో దిగి చెన్నైలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఏర్పాటు చేశారు. మిగతా భాషలకు ఎక్కడా కేంద్ర కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. భాషల విషయంలో బ్రిటీష్ పాలకులే నయమనిపించారు. ప్రజల భాషల్లో చదువులు నేర్పారు. పత్రికాలు, నిఘంటువులు ఇచ్చారు. మూలభాష దేవభాష అనకుండా జనంలోకి చొచ్చుకుపోయి తమ మతగ్రంథాలు, ప్రార్థనలను కూడా ఎవరి భాషలో వారిని చేసుకోనిచ్చారు. కాబట్టే ఇంగ్లీషుకు కోర్టులు, మతము, సాంకేతికత, వలసలు, వాణిజ్యం, విద్య, వినోదం అన్నీ తోడై సహజ పద్ధతుల్లోనే అంతర్జాతీయ భాషగా విస్తరించింది. హిందీని రాజభాషగా ఊరేగించాలన్న ఉత్సవాల కోరిక తప్ప పరోపకారం లేకపోతే ఎలా? ఏ భాష కైనా ఆదాన ప్రదానాలు ఇచ్చి పుచ్చుకోవటాలు తప్పవు. ప్రజలకు ఈనాడు ఇంగ్లీషు వలన ఒనగూడుతున్న ప్రయోజనాలు హిందీ వలన కూడా కలిగితే ప్రజలు వాళ్ళంతట వాళ్ళే స్వచ్ఛందంగా హిందీని కోరుకుంటారు. కోరుకోనివ్వాలి. సంస్కృతాన్ని సామాన్యులకు దాచిపెడితే పాచిపోయింది. లాటిన్, గ్రీకు భాషలు కూడా అంతే.

## హిందీ నేర్చుకుంటే లాభాలేమిటి?

రాజభాష హిందీ నేర్చుకున్నవారికి కలిగే లాభాలు ఏమిటి? లాభాలు చెప్పకుండా హిందీ దివసాల పేరుతో కోట్లరూపాయలు ఖర్చు పెట్టి ప్రచారం చేస్తున్నారు. మంచిదే. అయితే దేశభాషలందు మా భాష కూడా లెస్సే అనే మిగతా భాషల దివసాలకు కూడా బడ్జెట్లో డబ్బులిచ్చారా? ఇస్తే బాగుండేది. కేంద్ర ప్రభుత్వ ఖర్చుతో హిందీ ఆఫీసర్లు, రోజుకో హిందీ పదం, హిందీలో పరిభాషా కల్పన, ప్రాచుర్యం, సివిల్స్ పరీక్షలలో హిందీ లాంటి సదుపాయాలు హిందీకే కలిగిస్తున్నారు. తెలుగుకు ఏ సదుపాయమూ కల్పించనప్పుడు కంచి గరుడ సేవలాగా ఈ హిందీ భారమెందుకు? హిందీయేతర ప్రజలు మాతృభాషతోపాటు ఆంగ్లం చాలులే అనుకోరా? ఉపయోగాలులేని ఏకపక్ష హిందీ శాసనాల వల్ల మిగతా భాషస్తుల్లో అయిష్టత పెరుగుతుంది. ఎంతో కాలం గడిచాక ప్రాంతీయ భాషలలోనూ ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. ఇంగ్లీషు మీడియం వాళ్ళతో హిందీ మీడియం వాళ్ళు పోటీ పడలేకపోతున్నారు. హిందీ భాషకు అనేక రాయితీలు ఇచ్చారు. హిందీ వాళ్ళలాగా ఐఐటిలలో తెలుగులో చదువుకొని ఈ రోజుల్లో ఇంజనీర్లు కాగలమా? ఉద్యోగాలు వస్తాయా? ఉపాధి కోసమే కదా ఆంగ్ల మాధ్యమం విస్తరిస్తోంది? రాష్ట్ర భాషలు ఎందుకు క్షీణిస్తున్నాయి? కేంద్రమే హిందీతో ఉద్యోగాలు ఇవ్వలేకపోతే బడుగు ప్రజల బాగుకోసం ఇంగ్లీషునే కోరుకునే రాష్ట్ర ప్రభుత్వాలు వాటి

పరిధిలో ప్రాంతీయ భాషలతో ఉద్యోగాలు ఏమిస్తాయి? హిందీ నూతన విద్యావిధానంతో భారీ ఉపాధి సాధ్యమేనా?

## 80 ఏళ్ళ క్రితమే ఉర్దూ మీడియం

నైజాం ప్రభుత్వం 80 ఏళ్ల క్రితమే ఉర్దూ మీడియంలోనే వకీళ్ళు, వైద్యులు, శాస్త్రవేత్తలను తయారు చేసింది. తెలంగాణా విడిపోయాక తెలుగు ఉర్దూ అకాడమీలు రెండూ కనుమరుగయ్యాయి. జన ఘోషకు స్పందించాల్సిన సర్కారీ యంత్రాంగం జన భాషకు పట్టం కట్టాల్సిందేనంటూ పట్టు పట్టిన ఎన్టీఆర్, దస్త్రం తెలుగులో రూపొందిస్తేనే సంతకం చేస్తానన్నాడు. ఫైలు తెలుగులో తెస్తేనే సంతకం పెట్టాడు. యధారాజా తథా ప్రజా అన్నట్లు అధికారులు తెలుగులో ఫైళ్ళను పరుగులెత్తించారు.

భాషా ప్రాతిపదిక మీద జాతుల విభజన అనే సూత్రాన్ని మన దేశం సోవియట్ నుండే స్వీకరించింది. అక్కడ రష్యన్ భాషా రుద్దుడు ఎలాంటి ఫలితాన్ని తెచ్చిందో ఇక్కడ హిందీని బలవంతంగా రుద్దడం కూడా అలాంటి ఫలితాన్నే తెస్తుంది.

## బాలల్లో మాతృభాషా బీజాలు నాటాలి

బాలల్లో మాతృభాషలోనే విజ్ఞాన బీజాలు నాటాలి. మన పిల్లలకు తెలుగే సరిగా రాదు, ఆలోచన వికసించేదశలో హిందీ అదనపు భారమా? తన భాషే తనకు రాని పసి మనసును పరాయి భాషలకు వశం చేయటం కాదా? హిందీ రాష్ట్రాల్లో పిల్లలు ఇంగ్లీషుతోపాటు ఆధునిక భారతీయ భాషల్లో ఒకదాన్ని ఎంచుకోవాలట. హిందీయేతర రాష్ట్రాల్లో నైతే ఆంగ్లం, స్థానిక భాషతోపాటు హిందీ బోధన కూడా సాగాలట. వాస్తవానికి ఇంగ్లీషే జాతీయ భాష అన్నాయి కోర్టులు. సుప్రీం కోర్టులో చెలామణి అయ్యే ఇంగ్లీషే జాతీయ భాష. హిందీతోపాటు ఏ భారతీయ భాషకూ ఇంగ్లీషు స్థాయి దక్కలేదు. న్యాయస్థానాల్లోకి హిందీని ఈనాటికీ తీసుకురాలేక పోయారు. నాయకులు సైతం ఇంగ్లీషు వైపే మొగ్గారు. రాజ్యాంగమే ఇంగ్లీషులో రాశారు. హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హిందీని న్యాయస్థానాల గడప దగ్గరే ఆపేశారు. ఇంగ్లీషు తప్ప మరే భాషా హైకోర్టుల్లో వద్దన్నారు. అందరూ ఇంగ్లీష్ అభిమానులే. మద్రాసు హైకోర్టులో తమి ళాన్ని అధికార భాషగా వినియోగించేందుకు అనుమతించా లని కరుణానిధి విన్నవించారు, తమిళనాడు శాసనసభ తీర్మా నించింది. అయినా కేంద్రం తిరస్కరించింది. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో హిందీ తీర్పులు తేవాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అడిగినా లా కమిషన్ ఇంగ్లీషులో తప్ప హిందీలోగానీ ఇంకా ఏ ఇతర భారతీయ భాషలలో గానీ వాదనలు తీర్పులు కుదరవని తీర్మానించింది. హై కోర్టుల్లో హిందీ ఎందుకు వద్దో లా కమిషన్ చెప్పిన కారణాలు :

“భాష దేశ ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేస్తుంది. ప్రజలను ఐక్యపరుస్తుంది. ఎవరి మీదా ఏ భాషనూ బల వంతంగా రుద్దకూడదు. ఉన్నత న్యాయస్థానాలలోని వాదనలు తీర్పులు మామూలుగా జరిగేది ఆంగ్ల భాషలోనే. భారతీయ న్యాయ వ్యవస్థ ఇంగ్లీషుకు అమెరికా న్యాయ పుస్తకాలకు అలవాటుపడింది. కాబట్టి ఉన్నత న్యాయ మూర్తుల్ని ఇంగ్లీషుకే స్వేచ్ఛగా వదిలెయ్యాలి. ఒక రాష్ట్ర హైకోర్టు జడ్జి మరో ప్రాంతానికి బదిలీపై వెళితే ఆ రాష్ట్ర భాష నేర్చుకొని ఆ భాషలో తీర్పులివ్వాల్సివస్తుంది. అది చాలా కష్టం. జడ్జీల మీద అనేక భాషల భారం మోపకూడదు. వాళ్ళ మీద ఏ భాషనూ రుద్దకుండా జడ్జీలను వాళ్ళ భాషకు వాళ్ళను స్వేచ్ఛగా వదిలెయ్యాలి. దేశప్రజలందరూ తప్పక సర్వోన్నత న్యాయస్థానం తీర్పులిచ్చే ఏకైక భాష అయిన ఇంగ్లీషును అర్థం చేసుకోక తప్పదు. అన్ని కోర్టుల్లో ఇంగ్లీషే ఉంటే వివిధ భాషా ప్రాంతాల మధ్య న్యాయవాదుల కదలిక సులభం అవుతుంది. కోర్టుల్లో హిందీ అమలు కోసం కావా ల్సిన చట్టపరమయిన నియమాలు నిబంధనలు ముందు ఇంగ్లీషులోనే చెయ్యాలి. ఉన్నత న్యాయస్థానాలను మాత్రం ఆంగ్ల భాషను మార్చుకోమని అడగవద్దు”.

జాతీయ భాష హిందీకాదు ఇంగ్లీషే, దేశానికి ఆంగ్లమే దిక్కు అంటున్నారు న్యాయమూర్తులు. ఇంగ్లీషు రాని హిందీ వాళ్ళెవరూ హై కోర్టుల్లో పనికిరారు. హిందీగానీ, మరే భారతీయ భాషగానీ హై కోర్టుల దరిదాపుల్లోకి వెళ్లలేదు. జాతీయ అనుసంధాన భాష హిందీ కాదు ఇంగ్లీషే. హిందీ దివస్,‘హిందీవారం’, “రాత కోతలన్నీ హిందీలోనే” లాంటి కార్యక్రమాలన్నీ కోర్టుబయట మానసిక తృప్తి ఓదార్పు పొందటం కోసమే. 1990లోనే ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ ఇంగ్లీషు మీడియాన్ని రద్దుచేశాడు. ప్రభుత్వ కార్యా లయాల్లో హిందీనే వినియోగించాలంటూ ఆదేశించారు. నేటికీ హిందీ రాష్ట్రంలో హిందీ హైకోర్టులలోకి రాలేక పోయింది. తెలుగులోనే తీర్పులు వచ్చేలా గ్రామ న్యాయా లయాలు రాలేదు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుతీర్పులు అడిగే వాళ్ళే లేరు, హైకోర్టుల జోలికి వెళ్లకుండా అధికార భాషా సంఘాలతోనూ, భాషా ప్రాధికార సంస్థలతోనూ, కళాపరి షత్తులు, అకాడమీలు, అవధానాలు, దివసాలతోనూ భారతీయ భాషలు అన్నీ సరిపెట్టుకోక తప్పదు. ✤

'చరితార్థులు'

67

# మొహమ్మద్ ఆసిఫ్ అలీ (1888-1953)



**భారత జాతీయ** సైన్యం యోధులను, సర్దార్ భగత్‌సింగ్‌ను కాపాడేందుకు న్యాయపోరాటం సాగించిన మొహమ్మద్ ఆసిఫ్ అలీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బిజినోర్ జిల్లా నగిన గ్రామంలో 1888 మే 11న జన్మించారు. ఆసిఫ్ అలీ ఉన్నతవిద్య కోసం లండన్ వెళ్ళి 1914లో ఇండియాకు తిరిగి వచ్చి ఢిల్లీలో న్యాయవాదిగా స్థిరపడ్డారు. డాక్టర్ అనీబిసెంట్ ఆరంభించిన 'హోం రూల్' ఉద్యమంలో పాల్గొనడం ద్వారా ఆసిఫ్ అలీ క్రియాశీలక రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన అరుణా గంగూలిని మతాంతర వివాహం చేసుకున్నారు. ఆమె అరుణా ఆసిఫ్ అలీగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రఖ్యాతి గాంచారు. మొహమ్మద్ ఆసిఫ్‌అలీ ఉద్యమ ప్రసంగాలను, రాతలను ఆంగ్ల ప్రభుత్వం నిషేధించింది. ఆ చర్యకు నిరసనగా ఆయన విజయవంతంగా న్యాయపోరాటం సాగించటంతో ఆసిఫ్ అలీకి విశేష ప్రాచుర్యం లభించింది. డాక్టర్ ముక్తార్ అహ్మద్ అన్సారితో కలసి ఖిలాఫత్ – సహాయ నిరాకరణోద్యమంలో ఆయన ప్రధాన పాత్ర నిర్వహించారు. భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు న్యాయవాద వృత్తిని వదిలేసి పూర్తికాలపు జాతీయోద్యమ కార్యకర్తగా మారారు. ఢిల్లీలో జరిగిన జాతీయోద్యమ ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్నందుకు ఆయన 18 మాసాల జైలుశిక్ష అనుభవించారు. 1924 నాటి ముస్లిం లీగ్ సమావేశంలో పాల్గొని 'స్వరాజ్యం' ప్రతిపాదన తీర్మానంగా రూపుదిద్దుకునేలా తోడ్పడ్డారు. 'భారత ప్రభుత్వం చట్టం 1919' స్థానంలో నూతన రాజ్యాంగం రచన కోసం ఏర్పడిన కమిటీలో సభ్యునిగా ఆసిఫ్ అలీ తనదైన భాగస్వామ్యాన్ని అందించారు.



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు'** (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

మతతత్వానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించిన ఆసిఫ్ అలీ మత తత్వాన్ని రెచ్చగొట్టి, మత మనోభావాల ఆధారంగా భారత విభజనకు పురికొల్పుతున్న రాజకీయవాదులను క్షమించలేదు. జాతీయోద్యమ నేతగా ఏ బాధ్యత చేపట్టినా కార్యదక్షతతో కార్యక్రమాలను నిర్వహించడం ఆయన ప్రత్యేకత కావడంతో ఆంగ్ల ప్రభుత్వ ఆగ్రహానికి గురై సంవత్సరాల తరబడి జైలు జీవితాన్ని చవిచూశారు. 1945లో జరిగిన ఎన్నికలలో ఢిల్లీ నుండి విజయం సాధించి పండిట్ నెహ్రూ నేతృత్వంలో ఏర్పడిన మంత్రివర్గంలో చేరారు. ఆ తరువాత రాజ్యాంగ రచన సంఘం సాగించిన చర్చలలో పాల్గొని, లౌకిక భావాల పరిరక్షణాంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. సర్దార్ భగత్‌సింగ్ పక్షాన న్యాయ పోరాటం చేయడమే కాకుండా, Indian National Army యోధుల పక్షాన వాదించేందుకు భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన 'INA Defence Com-mitee కార్యదర్శిగా ఆయన విజయవంతంగా పనిచేశారు. స్వతంత్ర భారతదేశంలో పలు ఉన్నత పదవులను నిర్వహించిన ఆయన ప్రపంచ దేశాలలో భారతదేశం పేరు ప్రతిష్టలను ఇనుమడింప చేశారు. ప్రజ్ఞావంతుడైన న్యాయవాదిగా, ఉత్తమ ఉర్దూ సాహిత్యవేత్తగా, సునిశిత విమర్శకుడిగా, నిబద్ధత గల నేతగా, అసాధారణ వక్తగా, సమర్థుడైన రాయబారిగా అన్ని రంగాలలో రాణించారు. భారత సాంఘిక, రాజకీయ రంగాలలో శాశ్వత ముద్రను ప్రతిష్టించుకున్న మొహమ్మద్ ఆసిఫ్ అలీ 1953 ఏప్రిల్ 2న కన్నుమూశారు. ✤

30

# విశ్వాసుల మాత
# సయ్యిదా ఆయిషా رضي الله عنها

ఉర్దూ మూలం : అల్లామా సయ్యిద్ సులైమాన్ నద్వి (రహ్మ) | తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

అదిగో, ముందు ఆ ఒంటెను పడగొట్టండి. అది అక్కడ నిలబడి ఉన్నంతవరకూ యుద్ధం ఆగదు అని నలువైపుల నుండీ అరుపులు వినవచ్చాయి. బనూ జిబా తెగవారు ఒంటెకు రక్షణ వలయంగా నిలబడి ఉన్నారు. దాడి జరిపే వారిలో ఎవడు అటువైపు దూసుకుపోయినా తిరిగి వచ్చేవాడు కాదు. ఆ క్షణంలో ఆ తెగవారి నోట వెలువడిన కవితలు ఇవి :

1) ''జిబా తెగ వారి ముద్దు బిడ్డలము మేము
శత్రువును పడగొట్టనంతవరకూ
అతని ఎర్రని రక్తాన్ని కళ్ళారా చూడనంతవరకూ
పరారయ్యేవాళ్ళము కాము.''

2) ''ఓ మా మాతృశ్రీ! ఓ ఆయిషమ్మా!!
కలవరపడకండి. మీ ముద్దుబిడ్డలు
వీరులు, శూరులు.''

3) ''ఓ మా మంచి తల్లీ! ఓ దైవ సందేశహరుని
సతీమణీ!! ఓ శుభవంతుడైన, సన్మార్గ దర్శకుడైన
భర్తకు సతీమణీ!!!
వీటన్నింటికన్నా ఉత్సాహం ఉరకలు వేసే వారి జాతీయ నినాదం ఇది :

4) ''జిబా ముద్దుబిడ్డలం మేము
ఈ ఒంటెకు కాపరి వాళ్ళం మేము
మృత్యువు మా దృష్టిలో
తేనెకన్నా తియ్యనిది''

5) ''మృత్యువు ఒడిలో పెరిగినవారము మేము
మృత్యువు మాపై అవతరించినప్పుడు
అఫ్ఫాన్ పుత్రుడు ఉస్మాన్(రజి) హత్యోదంతాన్ని
బరిసెల మొనలతో తెలియపరుస్తాము
మా నాయకుణ్ణి మాకు వాపసు చెయ్యి
అలాగైతే సరే అంటాము''

ఉత్సాహం, ఆవేశం పరాకాష్టకు చేరినవేళ, వారిలోని ఒక్కొక్క మనిషి ముందుకు వచ్చి, ఒంటె పగ్గం పట్టుకుని నిలబడ సాగాడు. అతను నేలకొరగగానే మరో వ్యక్తి ఆ ఉత్తర దాయిత్వాన్ని నిర్వర్తించడానికి ముందుకు వచ్చేవాడు. అతను వధించబడితే మూడవవాడు వచ్చేవాడు. ఈ విధంగా డెబ్బయి మంది తల్లి ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో తమ ప్రాణాలను అర్పించారు. మహనీయ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) దగ్గరే నిలబడి ఉన్నారు. శత్రు వర్గంలో నుండి ఎవరు చేయి ముందుకు చాపినా, అతని చేయి ఒక్క ఖడ్గపు వ్రేటుకే తెగి

పడేది. గాలిలో గోడు బిళ్ళల్లా చేతులు ఎగిరెగిరి పడసాగాయి. ఇది చూసి మహనీయ అలీ(రజి) స్వయంగా ఆ రద్దీని చెదర గొట్టేందుకు ముందుకు కదిలారు. అష్తర్ నఖ్యీ (అసలు పేరు మాలిక్) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి)ను సమీపించారు. ఇద్దరూ గొప్ప పరాక్రమ శాలురే. ఖడ్గాలు ఝుళిపించబడ్డాయి. ఇద్దరూ గాయపడ్డారు. పరుగెత్తు కుంటూ వచ్చి అమాంతం ఒండొకరిని కౌగిలించుకున్నారు. ఆ క్షణంలో అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) బిగ్గరగా ఇలా అరిచారు :

"చంపేయండి! నన్నూ, మాలిక్‌ను కూడా
నాతోపాటు మాలిక్‌ను కూడా కడతేర్చండి."

అష్తర్ ఇలా అన్నారు: "నా అసలు పేరు మాలిక్ అన్న సంగతి జనులకు తెలియదు. అన్యథా నన్ను ముక్కలు ముక్కలుగా నరికి వేసేవారు."

బనూ జిబా తెగకు చెందిన కొంతమంది ప్రత్యర్థి దళంలో కూడా ఉన్నారు. ఆ ఒంటె తమ కళ్ళకు కనబడుతూ ఉన్నంత వరకూ తమ తెగకు చెందిన మనుషులు ఇలాగే ఒక్కొక్కరుగా అసువులు బాయటం తథ్యమని భావించారు. అందుకే ఒక జిబీ తెగవాడు అకస్మాత్తుగా వెనుక నుండి వచ్చి ఒంటె వెనుక కాలిపై ఒక్క ఖడ్గపు వేటు వేశాడు. దాంతో ఆ ఒంటె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. మహనీయ అమ్మార్ బిన్ యాసిర్(రజి), ముహమ్మద్ బిన్ అబీ బకర్ పరుగెత్తుకుంటూ వచ్చి అమ్మ ఆయిషా(ర.అ) కూర్చుని ఉన్న తొట్లను (హౌదజ్)ను పట్టుకున్నారు. ముహమ్మద్ బిన్ అబీ బకర్ లోపల చెయ్యి పెట్టి, ఆమె గారికి గాయమేద యినా అయిందేమోనని చూడదలిచారు.

"ఏ ధూర్తుని చెయ్యి ఇది?" అంటూ సయ్యిదా ఆయిషా (ర.అ) మండిపడ్డారు.

"నీ తమ్ముడు ముహమ్మద్‌ది. అక్కా! నీకు గాయమైతే కాలేదు కదా!"

"నీవు ముహమ్మద్‌వి కావు. నీవు మజ్‌మూమ్‌వి (దూషించ దగినవాడవు)" అన్నారామె.

అంతలో మహనీయ అలీ (రజి) వచ్చి, "తమరు క్షేమమే కదా!"అని అడిగారు.

"ఆఁ నేను క్షేమమే"నని సయ్యిదా ఆయిషా(ర.అ) జవాబి చ్చారు.

మహనీయ అలీ (రజి) తన వర్గానికి చెందిన ఒక బస్రా నాయకుని ఇంట ఆమె గారికి వసతి కల్పించారు. సయ్యిదా ఆయిషా(ర.అ) సైనికుల్లోని క్షతగాత్రులంతా అదే ఇంట్లోని ఒక మూల శరణు పొందారు. ఆ తరువాత మహనీయ అలీ(రజి), మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వచ్చి ఆమెను పరామర్శించారు. ఆ ఇంట్లో ఆమె వర్గానికి చెందిన చాలా మంది క్షతగాత్రులున్నారన్న విషయం మహనీయ అలీ(రజి)కి తెలిసింది. అయినా ఆయన ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. ఆ తరువాత ముహమ్మద్ బిన్ అబీబకర్ పర్య వేక్షణలో, 40మంది కులీన మహిళల వెంట అమ్మ ఆయిషా (ర.అ)ను సగౌరవంగా హిజాజ్ వైపునకు పంపారు. సామాన్య ముస్లింలు, స్వయంగా మహనీయ అలీ (రజి) కూడా చాలా దూరం నడిచి వచ్చి వీడ్కోలు పలికారు. మహనీయ హసన్ (రజి) గారైతే కొన్ని మైళ్ళ దూరం వరకూ నడిచి వచ్చి సాగ నంపారు. ఆ సమయంలో సయ్యిదా ఆయిషా(ర.అ) సమూ హాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "నాకు అలీ (రజి)తో ఇంతకు మునుపు కూడా ఎలాంటి మనస్పర్థ ఉండేది కాదు. ఇప్పుడూ లేదు. కాకపోతే అత్తా అల్లుళ్ళ మధ్య అప్పుడప్పుడూ మాటామాటా పెరుగుతుంది. దానిని నేను కాదనటంలేదు." మహనీయ అలీ (రజి) కూడా ఇలాగే స్పందించారు. పిదప ఈ చిన్న పయన బృందం హిజాజ్ వైపునకు సాగిపోయింది. (ఈ అధ్యాయంలోని సంఘటన లన్నీ- ఒక్కొక్క అక్షరం 'తారీఖె తబ్రీ- 6వ సంపుటంలోనుండి తీసుకున్నాము. వీటికి సంబంధించిన అత్యంత ప్రామాణిక మైన ఆధారాలు మాకు మరెక్కడా లభించలేదు. హదీసు గ్రంథాలలో ఈ సంఘటనల ప్రస్తావన లేదు)

మరికొన్ని నెలల్లోనే హజ్జ్ సీజన్ ఉండటం వల్ల అప్పటివరకూ ఆమె గారు పవిత్ర మక్కాలోనే ఉండిపోయారు. ఆ తరువాత మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) పవిత్ర సమాధి పక్కనే కుటీరంలో శేష జీవితం గడిపారు. 'సంస్కరణ' పేరుతో తాను చేపట్టిన ఉద్యమం వాస్తవానికి తన వల్ల జరిగిన భావాన్వయ పొరపాటు (ఇజ్తెహాదీ ఖతా) అని తెలుసుకుని ఆత్మావలోకనం చేసుకునేవారు. జీవితాంతం ఈ సంఘట నను తలచుకుని బాధపడేవారు. "అయ్యో! నేను రాయినైనా కాకపోతినే. అయ్యో! నేను చెట్టునయినా కాకపోతినే. నేను మట్టినయినా కాకపోతినే" అని చెప్పుకుని విలపించేవారు *(తబఖాత్ ఇబ్నె సాద్)*

'తారీఖె తబ్రీ' ప్రకారం బస్రాకు చెందిన ఒక వ్యక్తి అమ్మ

ఆయిషా(ర.అ)ను కలుసుకోవడానికి వచ్చాడు. "నువ్వు మా పోరాటంలో పాల్గొన్నావా?" అని అడిగారామె.

దానికతను 'అవున'న్నాడు.

"ఓ మా తల్లీ! మేమెరిగిన మహా తల్లీ" అంటూ ఒక వ్యక్తి కవిత చెప్పేవాడు. అతనెవరో నీకు తెలుసా? అని అడిగారు.

'అతను నా సోదరుడు' అన్నాడా వ్యక్తి.

ఆ మాట వినగానే ఆమెకు ఏడుపు ఆగలేదు. ఇక ఆమె గారి ఏడుపు ఆగదేమో అనిపించింది.

మరణానికి ముందు వసీయతు చేస్తూ, "నన్ను దైవప్రవక్త (సఅసం) పవిత్ర సమాధి ప్రక్కన ఖననం చేయకండి. బఖీ ఖననవాటికలో ప్రవక్త సతీమణులతోపాటే నన్ను కూడా ఖననం చేయండి *(సహీహ్ బుఖారీ- జనాయిజ్, హ.నెం. 1391). ఎందుకంటే ఆయన(స) తదనంతరం నా వల్ల ఒక పొరపాటు జరిగింది"* అన్నారు. *(ముస్తద్రక్ హాకిమ్- 4/6; తబఖాత్ ఇబ్నె సాద్- 8/74)*

దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది ఆయత్ పారాయణం చేసినప్పుడల్లా ఆమె దుఃఖం కట్టలు త్రెంచుకుని ప్రవహించేది. ఏడ్చి ఏడ్చి కొంగు తడిసిముద్ద అయ్యేది *(తబఖాత్ ఇబ్నెసాద్- 8/ 80).*

ఆ ఆయత్ ఇది :

**"(ప్రవక్త సతీమణులారా!) మీ ఇండ్లలోనే ఆగి ఉండండి."** ***(అల్ అహ్‌జాబ్: 33)***

## దుష్ప్రచారం : ఖండన

'ఇఫ్క్ సంఘటన' సందర్భంగా మహనీయ అలీ (రజి) సయ్యిదా ఆయిషా(ర.అ) గురించి వెలిబుచ్చిన అభిప్రాయాన్ని మనసులో పెట్టుకుని ఆమె గారు కదన రంగానికి కదలి వచ్చారని కొంతమంది కుత్సిత మనస్కులు ప్రచారం చేశారు. కాని జమల్ యుద్ధానికి దారితీసిన కారణాలేవో మీ ముందు చాలా స్పష్టంగా విశదీకరించాము. సయ్యిదా ఆయిషా(ర.అ) గారి ఉపన్యాసాలను కూడా హెచ్చుతగ్గులు లేకుండా పొందు పరిచాము. వాటిలో ఎక్కడా మహనీయ అలీ(రజి) గురించి ఆమె ఒక ముక్క కూడా ఏమీ చెప్పలేదు. యుద్ధం అనుకో కుండా మొదలయింది. గుప్పెడు మంది ముష్కరుల అపరాధం మూలంగానే ఇది జరిగింది తప్పితే ఇరువర్గాలకు చెందిన జనుల ప్రమేయం ఏమీలేదు. వారంతా నిర్దోషులు.✤

# ఆత్మజ్ఞానం

ఎస్.ఎమ్. మలిక్

**ముక్కచెక్కలయిన నా**
**వ్యక్తిత్వ నిర్మాణ లోపమే**
**ఛిద్రమయిన మనిషిలో**
**సుస్థిరస్థితినీ నిగ్రహాగ్రహా**
**వేశాలనూ ఇనుమడింప**
**జేయ గలగిందంటే లోని**
**గోప్యమయిన అఖండ**
**వ్యక్తిత్వశక్తినీ పరిశీలించి**
**ఏ స్థితిలోనూ అచ్చెరువు**
**చెందే హేతువు మించిన**
**అద్భుతాలు సాధించ గల**
**మానవాత్మను గమనించు!**
**మానవుడే ఇలలో నేటికీ**
**మహనీయుడని గుర్తించు!!**
**ఆలస్యంగానేసరి కలిగింది**
**అలసిపోయిన మానవునికి**
**సంతసించు ఆత్మజ్ఞానం !!!**



# మోడల్... రోల్‌మోడల్‌గా మారింది

- నుస్రత్ ఫాతిమా

**ప్రపంచంలోనే** మొట్టమొదటి హిజాబ్ ధరించి ఫ్యాషన్ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన హలీమా అదన్ ఇప్పుడు ఫ్యాషన్ షోలకు గుడ్‌బై చెప్పింది. ఫ్యాషన్ ప్రపంచంలో స్టార్‌గా ఎదుగుతున్న సమయంలో ఆమె తీసుకున్న ఈ నిర్ణయానికి ఇండస్ట్రీ మొత్తం షాక్‌కు గురయింది. తాను ఆచరిస్తున్న ధార్మిక కట్టుబాట్ల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని ప్రకటించింది. ఫ్యాషన్ షోలో పాల్గొంటూ ధార్మిక కట్టుబాట్లలో ఇమడటం అయ్యే పని కాదు. ఒక్కోసారి ఫ్యాషన్ షోలలో హిజాబ్ తొలగించి షోలు చేయమని ఒత్తిడి చేసేవారని, ఇది తననెంతో బాధించేదని ఆమె చెప్పింది.

23 ఏళ్ల హలీమా అదన్ ఓ కంపెనీలో మోడల్‌గా పనిచేస్తోంది. తన ఫ్యాషన్ షోలతో ప్రపంచ వ్యాప్తంగా సెలబ్రిటీగా మారిపోయింది. 19 ఏళ్లకే హిజాబ్ ధరించి ఫ్యాషన్ షోలో పాల్గొన్న వనితగా ఎంతో ప్రసిద్ధిచెందింది. మూడేళ్లుగా తన ఫ్యాషన్ షోలలో బిజీగా ఉంటోంది. ఫ్యాషన్ ప్రపంచంలో నెంబర్ వన్ మోడల్‌గా ఎంతో పేరు సంపాదించింది.

అయితే కొన్ని రోజుల క్రితం తాను ఫ్యాషన్ ఇండస్ట్రీకి గుడ్ బై చెబుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు తనతోటి మోడళ్లకు ఆశ్చర్యం కలిగించింది. 'ఫ్యాషన్ వృత్తిలో ఉంటూ ఇస్లామ్ కట్టుబాట్లను, విధివిధానాలను పాటించేందుకు ఎంతో ప్రయత్నించాను. కానీ ఈ వృత్తిలో ఉంటూ ధార్మిక కట్టుబాట్లను పాటించడం అయ్యేపనికాదని తెలిసొచ్చింది. ఒక్కోసారి షోలలో ధార్మిక పరిధులను కూడా అతిక్రమించాల్సి వస్తుంది అందుకే షోలను శాశ్వతంగా మానుకుంటున్నాను.' అని సోషల్ మీడియాలో రాసుకొచ్చారామె.

'అమెరికన్ అవుట్ ఈగల్ ఫిటర్ షో' షూటింగ్‌లో ఉన్నప్పుడు నా తలపై హిజాబ్ తీసేయాలని చెప్పారు. ఒప్పందం ప్రకారం అయిష్టంగానే ఆ షో షూట్ జరిగింది. షూటింగ్ ముగిసాక హొటల్ రూములో అద్దంలో నా ముఖం చూసుకుంటే నా శరీరంలో ఒక అవయవాన్ని తొలగించినట్లనిపించింది. అద్దం ముందు నిల్చుని భోరున ఏడ్చేశాను. నన్ను నేను నిందించుకున్నాను' అని ఆమె ఒక పోస్టులో భావోద్వేగంగా రాసింది. 'మూడేళ్ల ఫ్యాషన్ వృత్తిలో ఏనాడు సంతృప్తి ఉండేది కాదు. ఎప్పుడూ ఏదో కోల్పోతున్న అనుభూతి నన్ను వెంటాడేది' అంటారామె. షోలలో నమాజులన్నీ మిస్సయేవని తీవ్రంగా బాధపడతారామె.

హలీమా అదన్ సోమాలియా దేశానికి చెందినవారు. అక్కడి దేశ పరిస్థితుల వల్ల కెన్యా దేశంలోని క్యాంపుల్లో గడిపారు. తెలిసిన వారి ద్వారా హిజాబ్ ధరించి ఫ్యాషన్ షోలలో పాల్గొనే అవకాశం లభించింది. సాంప్రదాయిక పవిత్రమైన హిజాబ్ వస్త్ర ధారణను ఫ్యాషన్ షోకు తీసుకువచ్చి చాలా పెద్ద తప్పు చేశానని ఆమె తెలుసుకున్నారు.

కరోనా లాక్‌డౌన్‌లో ఆమె తన ఇంటివారితో గడిపినన్ని రోజుల్లో తనకు నిజమైన మార్గదర్శకం లభించిందని ఆమె చెబుతారు. తన భవిష్యత్తును వెలుగుమయం చేసుకునే అవకాశం లభించిందంటారామె. ఇంటి వారితో గడిపినన్ని రోజులు తాను తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నానన్న విషయం తెలిసొచ్చింది. ఇక ఇప్పుడు ఈ ఇండస్ట్రీ వదిలి నిజమైన ముస్లిమ్ వనితగా జీవితాన్ని గడపాలని ఆమె గట్టి సంకల్పం చేసుకున్నారు. దీనికి ఆమె తల్లి ప్రోత్సాహం కూడా తోడైంది. తాను తీసుకున్న నిర్ణయానికి ఆమె తల్లి మద్దతిచ్చారు.

తాను తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ఎవరి ఒత్తిడీ లేదని, పూర్తి స్పృహతోనే ఈ నిర్ణయానికొచ్చానని ఆమె అంటారు. నా విశ్వాసాన్ని నేను కాపాడుకోవాలంటారామె. హలీమా తీసుకున్న నిర్ణయానికి ఎంతోమంది మోడళ్లు అభినందించారు. మోడల్ ప్రపంచానికి గుడ్ బై చెప్పి రోల్ మోడల్‌గా మారిన హలీమాకు మనమూ అభినందనలు తెలుపుదాం. ✤

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ (ఖుర్‌ఆన్ అవగాహనం): మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది, తెలుగురూపం: ఎస్.ఎమ్. మలిక్**

**88 ఆయత్‌లు**

# 38. సాద్

**మక్కా అవతరణ**

25 – 26... అప్పుడు మేము అతని ఆ తప్పిదాన్ని మన్నించివేశాము, నిశ్చయంగా మా వద్ద అతనికి అతి సన్నిహిత స్థానముంది, ఇంకా ఉత్తమ అంతిమ పరిణామముంది.[27] (మేము అతనికి చెప్పాము) దావూద్, మేము నిన్ను భువిలో ఖలీఫా చేశాము, కనుక నీవు జనుల మధ్య ధర్మంగా పరిపాలన చెయ్యి. మనోకాంక్షను అనుసరించకు, అది నిన్ను దైవమార్గం నుంచి దారి తప్పిస్తుంది. ఎవరయితే దైవమార్గం నుండి తప్పిపోతారో నిశ్చయంగా వారి కొరకు కఠినమయిన శిక్ష పొంచి ఉంది, కారణం వారు లెక్కచూపే దినాన్ని అసలే మరచిపోయారు."[28]

27. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే హజ్రత్ దావూద్ వల్ల నిశ్చయంగా తప్పు జరిగింది. ఆ తప్పు గొర్రెల ఉపమానానికి సరిపోయేటటువంటి తప్పు అయి ఉంటుంది. అందువల్లనే దానికి తీర్పు చెప్పగానే వెంటనే ఆయనకు తట్టింది, ఇది తన పరీక్ష నిమిత్తం జరిగిందని. కాని ఆ తప్పు మరీ తీవ్ర మయిందేమీ కాదు, దాన్ని క్షమించడం, క్షమించినా ఆయన్ని ఉన్నతస్థాయి నుండి దిగజార్చడం అవసరమయినటువంటిదీ కాదు. అల్లాహ్ స్వయంగానే చెబుతున్నాడు, ఆయన సజ్దాలో పడిపోయి తౌబా చేసినప్పుడు ఆయన్ని క్షమించడం మాత్రమే కాక ఇహపరలోకాల్లో ఆయనకు ప్రాప్తమయిన ఉన్నత స్థానం లోనూ ఎటువంటి మార్పు రాలేదని.

28. ఇది హజ్రత్ దావూద్ (అ) చేసిన తౌబాని స్వీకరించి ఉన్నత స్థానాల శుభవార్తనివ్వడంతోపాటు పరమ ప్రభువు అల్లాహ్ ఆయనకు చేసిన హెచ్చరిక. దీన్నిబట్టి స్పష్టంగా తెలి పోతుంది, ఆయన వల్ల జరిగిన చేష్టలో మనోకాంక్ష ప్రాబల్యం కొంతయినా ఉండింది. సాధికార సత్తాను అనుచితంగా వినియోగించడం కూడా అందులో ఎంతో కొంత ఉండింది. ఆ చేష్ట, ధర్మబద్ధంగా పరిపాలన చేసే ఏ వ్యక్తికీ శోభించనటు వంటిదయి ఉంటుంది.

ఇక్కడ మూడు ప్రశ్నలు మనకు ఎదురవుతాయి. మొదటిది, ఆ చేష్ట ఏమయి ఉంటుంది? రెండు, అల్లాహ్ దాన్ని అతి స్పష్టంగా వివరించడానికి బదులు చాటుమాటుగానే దాన్ని ఎందుకు సూచించాడు? మూడు, ఈ పూర్వరంగంలో దాని ప్రస్తావన ఏ ఔచిత్యం ప్రకారం వచ్చింది?

బైబిల్ (యూదులూ క్రైస్తవుల పవిత్ర గ్రంథం) ని అధ్యయనం చేసినవారికి మహనీయ దావూద్‌కు సంబంధించిన గాథ తెలియనిదేమీ కాదు. ఈ గ్రంథంలో హజ్రత్ దావూద్‌పైన హిత్తీయుడయిన ఊరియా (Uriah the Hittite) భార్యతో వ్యభిచరించినట్లు, తరువాత ఊరియాను యుద్ధానికి పంపి చంపించినట్లు తరువాత అతని భార్యను పెళ్ళాడినట్లు అతి స్పష్టంగా నిందారోపణ ఉంది. అంతే కాదు, ఈ స్త్రీ, ఒక వ్యక్తికి భార్య అయినప్పటికీ తన్ను తాను మహనీయ దావూద్ (అ)కు అర్పించుకున్నది ఈవిడే, హజ్రత్ సులైమాన్(అ) తల్లి అని కూడా చెప్పడం జరిగింది. ఈ గాథ అంతా బైబిల్‌లో సమూయేల్ రెండవ గ్రంథం: 11, 12లో చాలా వివరంగా వ్రాయబడి ఉంది. ఖుర్‌ఆన్ అవతరణకు శతాబ్దుల పూర్వం బైబిల్‌లో నమోదయి ఉంది. ప్రపంచంలోని యూదులు, క్రైస్తవులలో ఈ పవిత్ర గ్రంథాన్ని పారాయణం చేసినవారు లేదా దాన్ని విన్నవారు ఈ గాథను గురించి ఎరగడమే కాక దాన్ని విశ్వసిస్తారు కూడా. ఈ జనుల ద్వారానే ప్రపంచంలో ఇది ప్రసిద్ధమయి పోయింది - నేటికీ పశ్చిమ దేశాలలో ఇస్రాయీలీయులు, హెబ్రూ మత చరిత్రకు సంబంధించిన ఏ పుస్తకం వ్రాసినా హజ్రత్ దావూద్‌పైన ఈ ఆరోపణను పునరుక్తం చేయనిదే వ్రాయడం జరగదు.

ఈ సుప్రసిద్ధ గాథలో ఈ విషయమూ నమోదయి ఉంది :

కావున యెహోవా నాతానును దావీదు నొద్దకు పంపెను, అతడు వచ్చి దావీదుతో ఇట్లనెను- ఒకానొక పట్టణమందు ఇద్దరు మనుష్యులుండిరి. ఒకడు ఐశ్వర్యవంతుడు, ఒకడు దరిద్రుడు. ఐశ్వర్యవంతునికి విస్తారమైన గొర్రెలును, గొడ్లును కలిగి యుండెను. అయితే ఆ దరిద్రునికి తాను కొనుక్కొనిన యొక చిన్న ఆడు గొర్రె పిల్ల తప్ప ఏమియు లేకపోయెను. వాడు దానిని పెంచుకొనుచుండగా అది వాని యొద్దను వాని బిడ్డల యొద్దను ఉండి పెరిగి వాని చేతి ముద్దలు తినుచు వాని గిన్నెలోనిది త్రాగుచు వాని కౌగిట పండుకొనుచు వానికి కుమార్తెవలె ఉండెను.

**(28వ పాదసూచిక తరువాయి భాగం వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**

**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## వాణిజ్య ప్రకరణం

**(క్రయ విక్రయాలు)**

**346)** మహనీయ ఇబ్నె ఉమర్(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(సఅసం) ఈ విధంగా ఉద్బోధించారు: "ఏ వ్యక్తి అయినా సరే ఆహార ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పుడు, దానిని పూర్తిగా తన స్వాధీనంలోనికి తీసుకోనంతవరకూ అమ్మకూడదు". ఇస్మాయీల్ తన ఉల్లేఖనంలో అదనంగా ఇలా అన్నారు: "ఎవరయినా ఏదైనా ధాన్యాన్ని కొన్నప్పుడు, దానిని స్వాధీనపరచుకోకముందే అమ్మరాదు."

### అధ్యాయం : 55

**కొలవకుండా, తూకం వేయకుండా ధాన్యపు రాశిని కొనుగోలు చేసిన వ్యక్తి, దానిని తన ఆవాసానికి తీసుకురానంతవరకూ వేరొకరికి అమ్మరాదు. దీనికి విరుద్ధంగా వ్యవహరించేవానికి విధించే శిక్ష గురించి...**

**347)** సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్(రజి) అందించిన సమాచారం ప్రకారం ఆయనతో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా చెప్పారు: "నేను దైవ ప్రవక్త (సఅసం) కాలంలో జరిగిన దానికి ప్రత్యక్ష సాక్షిని. ప్రజలు ఆహార ధాన్యాన్ని కొనుగోలు చేసి, తమ ఆవాసానికి తీసుకురాకముందే అమ్మినందుకు తీవ్రంగా మందలించబడేవారు."[1]

### అధ్యాయం : 56

**ఎవరయినా ఏదయినా వస్తు సామగ్రిని లేదా ఒక పశువును కొనుగోలు చేసి, దానిని అమ్మకందారుని వద్దనే ఉంచితే, ఆ వస్తుసామగ్రి చేతికి రాకుండాపోతే లేదా పశువు చచ్చిపోతే, అప్పటికి కొనుగోలు చేసిన వ్యక్తి దానిని తన స్వాధీనంలోనికి తీసుకోకుండా ఉంటే...**

ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: కొనుగోలు చేసిన సమయంలో సజీవంగా ఉండి, ఆ వర్తక వ్యవహారంలో భాగంగా ఉన్న వస్తువు గనక చేతికి రాకుండాపోతే దాని బాధ్యత కొనుగోలుదారునిదే. (అమ్మకందారునిపై దండుగ విధించబడదు).

347-1. ఈ హదీసు ద్వారా విదితమైనదేమిటంటే అక్రమంగా వర్తకం చేసిన వారిని ఇస్లామీయ పరిపాలకుడు శిక్షించగలడు. ఇమామ్ మాలిక్ (రహ్మ) అభిమతం ఏమిటంటే; కొలవకుండా, తూయకుండా వస్తువును కొన్న వ్యక్తి, దానిని తన స్వాధీనంలోనికి తీసుకోకముందే అమ్మి వేయగలడు. అయితే ఈ హదీసు ద్వారా ఆయన అభిప్రాయం రద్దయిపోతుంది.

కేంద్ర ప్రభుత్వం రాత్రికి రాత్రి తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలి. ఇది హర్యానా, పంజాబ్ రైతుల సమస్యగానే ప్రభుత్వం చూస్తోంది. ఇది యావత్ దేశ రైతులందరి సమస్య. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. కడుపుకు అన్నం తినేవారెవరైనా ఈ చట్టాలను నిరసించాల్సిందే. కార్పోరేట్లకు లబ్ధిచేకూర్చే ఈ చట్టాలను రద్దు చేసేవరకూ రైతుల పోరాటానికి మా మద్దతు ఉంటుంది.



# అన్యాయాలపై ఎంపీజే పోరుబాట

**మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, తెలంగాణ అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్**

**సమాజంలో పెచ్చరిల్లుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలు, అసమానతలపై ఉద్యమస్థాయిలో పోరాడుతోంది మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్. ప్రత్యేక తెలంగాణ సాధనలో ఎంపీజే పోషించిన పాత్ర అందరికీ తెలుసు. తెలంగాణ జేఏసీలో అప్పటి ఎంపీజే అధ్యక్షులు క్రియాశీల పాత్ర పోషించారు. దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి, అన్యాయాలు, అసమానతలు లేని తెలంగాణకోసం దశాబ్దన్నర కాలంగా ఎంపీజే చేస్తున్న ఉద్యమాలకు ప్రజల మద్దతు లభిస్తోంది. ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకే అందాలి. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం ఉండకూడదంటారు ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్. గీటురాయి ప్రతినిధి ముహమ్మద్ ముజాహిద్‌తో ఆయన ఎంపీజే ఉద్యమ కార్యకలాపాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..**

షాదీ ముబారక్ కానివ్వండి, కళ్యాణ లక్ష్మి పథకం కానివ్వండి, ఇలా మరే ప్రభుత్వ పథకమైనా ప్రజలకు రావాల్సిన సొమ్మును మధ్యదళారులు కాజేసే వార్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. రూ.50వేల జీతం సంపాదించే అధికారి పట్టుమని

పదివేలు కూడా సంపాదించలేని అభాగ్యుల దగ్గర లంచం తీసుకుంటే ఇక మనముంటున్న ఈ సమాజంలో మానవత్వమనేది ఏముంది. ఈ దుర్మార్గాలను నిరసించడం మనందరి కర్తవ్యం కాదంటారా? దౌర్జన్యాలు, అన్యాయాలను చూసి మౌనంగా ఉండేవారే సమాజ ద్రోహులు. అన్యాయాన్ని సహిస్తూ పోతే అది మరింత పెరుగుతుందే తప్ప దానికి అంతం ఉండదు. అందుకే ఎంపీజే ఉద్యమస్థాయిలో అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలపై పోరాడుతుంది. లబ్దిదారులకు వారికి అందాల్సిన న్యాయపరమైన హక్కులను అందించేందుకు మా కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తున్నారు. బలహీనుల గొంతుకగా, పేదల గుండె చప్పుడుగా ముందుకెళుతున్నాము. ప్రజల మన్ననలూ అందుతున్నాయి.

## ప్రజల అవసరాలు తీర్చడం ప్రభుత్వ బాధ్యత..

చలికాలం వచ్చిందంటే ఎంతోమంది అభాగ్యులు, ఫుట్‌పాత్‌ల మీదా, రైల్వేస్టేషన్లలో, రోడ్ల మీద చలికి గజగజా వణుకుతూ నిద్రిస్తుంటారు. ఇలాంటి వారందరికీ ప్రభుత్వం షెల్టర్లు ఏర్పాటు చేయాలి. కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదు. ఆ బాధ్యత ప్రభుత్వం నిర్వర్తించాలి. ఆ కాలంలో పాలకులు ఆకలితో ఒక మేక చనిపోయినా ఆందోళన చెందేవారు. ఆ స్ఫూర్తి నేటి పాలకుల్లో కరువైంది. ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేయాల్సిన ప్రభుత్వాలు తమ పాలనా విధానాలతో ప్రజల్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి. ప్రజాజీవితం దుర్భరంగా మారిపోతోంది. పాలకుల అసమర్థత వల్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పేదవాడు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నాడు. ధనవంతుడు మరింత ధనవంతుడయ్యేలా ఉన్నాయి మన ఆర్థిక విధానాలు. ఈ ధోరణి అంతమవ్వాలన్నది మా ధ్యేయం. వడ్డీ రహిత సమాజం ఉనికిలోకి రావాలి. ఏ నేరం చేయని వాళ్లు జైళ్లలో మగ్గుతున్నారు. నేరాలకు పాల్పడిన వాళ్లు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. ఇది సమాజానికి మరింత ప్రమాదకరం.

## వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలి..

కేంద్ర ప్రభుత్వం రాత్రికిరాత్రి తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలి. ఇది హర్యానా, పంజాబ్ రైతుల సమస్యగానే ప్రభుత్వం చూస్తోంది. ఇది యావత్ దేశ రైతులందరి సమస్య. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. కార్పోరేట్లకు లబ్దిచేకూర్చే ఈ చట్టాలను రద్దు చేసేవరకూ రైతుల పోరాటానికి మా మద్దతు ఉంటుంది.

## ప్రైవేటు టీచర్లను ఆదుకోవాలి

ప్రైవేటు బడుల్లో టీచర్లుగా పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలి. గత పది నెలలుగా జీతాలు లేక వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రైవేటు టీచర్ల కనీస ఆదాయాన్ని రూ.20వేలకు పెంచాలి. వారి సర్వీసులను రెగ్యులర్ చేయాలి.

## 12శాతం ముస్లిమ్ రిజర్వేషన్లు ఏమయ్యాయి?

అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 12శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న కేసీఆర్ మాటలు నీటి మూటలయ్యాయి. రెండోసారి అధికారాన్ని కట్టబెట్టినా కేసీఆర్ తన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. టీఆరెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 12 శాతం రిజర్వేషన్లను ఇప్పటికైనా ఇవ్వాలి. జస్టిస్ రాజేందర్ సచార్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా సిఫారసులను అమలు చేయాలి.

## నిరుపేద ఖైదీల విడుదల..

క్షణికావేశానికి లోనై కొందరు, చేయని నేరానికి ఇంకొందరు జైలు ఊచలు లెక్కిస్తుంటారు. కుటుంబ పెద్ద జైలుపాలవడం వల్ల ఆ కుటుంబం దుర్భరపరిస్థితులను ఎదుర్కొంటుంది. జైలు అధికారుల సూచన మేరకు సత్ప్రవర్తన కలిగి, శిక్ష పూర్తయి పూచీకత్తు కట్టలేని ఖైదీలకు మేం ఆ డబ్బును చెల్లించి వారి విడుదలకు సహకరిస్తున్నాము. చర్లపల్లి, చంచల్‌గూడ, వరంగల్, సంగారెడ్డి జైళ్ల నుంచి ఎంతోమంది నిరుపేద ఖైదీల పూచీకత్తును చెల్లించి వారికి స్వేచ్ఛ ప్రసాదించాము. ఖైదీలను ఇలా సకాలంలో విడుదల చేయడం వల్ల ఇటు వారి కుటుంబాలను ఆదుకున్నట్లవుతుంది. ఒక్కో ఖైదీ విడుదలకు రూ.వేలల్లోనే ఖర్చవుతుంది. ఏటా రమజాన్ నెలలో చంచల్‌గూడ జైలులో ఖైదీలకు సహెరీ ఏర్పాట్లు చేస్తున్నాము. ఇలా చేయడం వల్ల ఖైదీలు ఉపవాసం పాటించేలా చేసి వారిలో పరివర్తన తెచ్చేందుకు కృషిచేస్తున్నాము.

## మతతత్వ పార్టీలను అడ్డుకోవాలి

మన తెలంగాణ సమాజం గంగా-జమునా సంస్కృతికి నిదర్శనం. శతాబ్దాల చరిత్ర ఉన్న తెలంగాణలో ఇప్పుడు కొన్ని మతతత్వ పార్టీలు ప్రజల్ని విడగొట్టి గద్దెనెక్కాలని చూస్తున్నాయి. మతతత్వ పార్టీలను తిప్పికొట్టేందుకు, ప్రజల్ని సమైక్య పరిచేలా మేం ఎప్పటికప్పుడు ముందుకెళుతున్నాము. మనమంతా ఐక్యంగా ఉంటేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుంది. ✤




# చపాతి అంటే ఏమిటి?

షేక్ అబ్దుల్ బాసిత్. కొత్త గూడెం

నసీరుద్దీన్ తమ రాజ్యంలోని ధార్మిక పండితులు, దార్శనికులు, రాజ్యాధికారులు, రాజపరివారంవారు అజ్ఞానులని, నిలకడలేని వారని, మూర్ఖులని ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నాడని రాజుకు ఫిర్యాదు అందింది. అందుకు రాజు ముల్లా నసీరుద్దీన్‌తో పాటు, ధార్మిక పండితులను రాజ్యాధికారులను, దార్శనికులను రాజ దర్బార్‌కు పిలిపించాడు. అందరి సమక్షంలో రాజు నసీరుద్దీన్‌ను ఉద్దేశించి, "నసీరుద్దీన్, రాజ్యంలోని ప్రజల్లో నువ్వు మా పట్ల దుష్ప్రచారం చేస్తున్నావని నీ మీద అభియోగం మోపబడింది. దానికి నీ సమాధానం ఏమిటో చెప్పు?" అని అడిగాడు.

దానికి నసీరుద్దీన్ "అయ్యా! మీరడిగిన దానిని నేను సమాధానం చెబుతాయి. అయితే ముందుగా మీరు ఏడు కాగితాలను తెప్పించి, ఏడుగురు బాగా తెలివితేటలు కలవారిని పిలిపించండి" అని అభ్యర్థించాడు.

రాజు రాజ్యంలోని ఏడుగురు మేధావులను పిలిపించాడు. నసీరుద్దీన్ వారితో మీరంతా 'రొట్టె అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు మీకివ్వబడిన కాగితాల మీద సమాధానం వ్రాసి ఇవ్వండి అన్నాడు.

ఆ ఏడుగురు తమకు తోచిన సమాధానాలు వ్రాసి నసీరుద్దీన్‌కు ఇచ్చారు.

మొదటి వాడు:. రొట్టె ఒక విధమైన ఆహారం.

రెండవ వాడు : పిండి, నీటి మిశ్రమం.

మూడవ వాడు: ఇది దైవం ప్రసాదించిన వరం.


నాల్గవ వాడు: కాల్చబడిన పిండి వంటకం.

ఐదవ వాడు: రొట్టె మీద మీ అభిప్రాయం ఏమిటి అనే దానిపై దీని సమాధానం ఆధారపడి ఉంటుంది.

ఆరవ వాడు: నాకు తెలియదు.

ఏడవ వాడు: దీని మీద నేను ఏమీ చెప్పలేను అని సమాధానాలు వ్రాసి ఇచ్చారు.

ఇంతటి మేధావులు, జ్ఞాన పండితులు "రొట్టె అంటే ఏమిటి ?" అనే చిన్న విషయం మీద భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నారే, అలాంటిది నేను ప్రజల్లో వీరి పట్ల, మీ పట్ల దుష్ప్రచారం చేస్తున్నాననే ఏకాభిప్రాయానికి ఎలా రాగలిగారు? రోజు తినే రొట్టె మీదే భిన్నాభిప్రాయం కల ఇలాంటి మహా మేధావులు ఒక్కటై నేను ప్రజల బుర్రలు పాడు చేస్తున్నాను? అని ఏలా అభియోగం మోపగలిగారు అని అడిగాడు.



# అలా అడగొద్దు!

- నసీరా బేగం

ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త(స)గారి వద్దకు వచ్చి సహాయం చెయ్యమని అర్థించాడు. దానికి ఆయన(స) ఏమిటి నీ ఇంట్లో ఏమీ లేదా? అని ప్రశ్నించారు. అతను ఇలా విన్నవించుకున్నాడు: నా దగ్గర ఒక కంబళి ఉంది. కొంత భాగం క్రింద పరుస్తాను. మరికొంత కప్పుకుంటాను. ఒక గిన్నె ఉంది. దానితో మంచి నీళ్ళు త్రాగుతాను. అది విని దైవప్రవక్త(స), నీవు నీ ఇంటికి వెళ్ళి అవి నా వద్దకు తీసుకుని రా అని అన్నారు. అప్పుడు అతను ఇంటికి వెళ్ళి ఆ రెండు వస్తువులు దైవప్రవక్త(స) గారి వద్దకు తీసుకుని వచ్చాడు. వాటిని దైవప్రవక్త(స) తన చేతిలో తీసుకుని ఎవరైనా వీటిని కొంటారా? అని ప్రకటించారు. ఒకతను నేను వాటిని ఒక దిర్హమ్‌కు కొంటాను అని అన్నాడు. దైవప్రవక్త(స) వీటిని ఒక దిర్హమ్ కంటే అధిక ధర ఇచ్చి కొంటారా? అని రెండు మూడుసార్లు ప్రకటించారు. అప్పుడు నేను రెండు దిర్హమ్‌లలో కొంటాను అని ఒకతను అన్నాడు. అప్పుడు అతనికి వాటిని ఇచ్చి రెండు దిర్హమ్‌లు తీసుకున్నారు. తరువాత దాని యజమానికి ఆ రెండు దిర్హమ్‌లు ఇచ్చి ఒక దిర్హమ్‌తో ఇంటివారికోసం భోజనం తీసుకుని వెళ్ళు. రెండో దిర్హమ్‌తో ఒక గొడ్డలిని కొనుక్కుని నా దగ్గరకు రా అన్నారు. అతను అలాగే చేశాడు. గొడ్డలిని తీసుకుని దైవప్రవక్త(స) తన చేతులతో దానికి కర్రను జోడించి ఇది తీసుకుని వెళ్ళి అడవి నుంచి కర్రలను కొట్టి తీసుకొచ్చి బజారులో అమ్ము. పదిహేను రోజుల వరకు నా వద్దకు రాకు. పదిహేను రోజుల తరువాత నీవు నాకు కనబడాలి అని అన్నారు. అతను అక్కడ నుంచి గొడ్డలి తీసుకుని వెళ్ళిపోయాడు. కట్టెలు కొట్టి అమ్మసాగాడు. పదిహేను రోజుల తరువాత పది దిర్హమ్‌లు పొదుపు చేసుకున్నాడు. వాటితో కొన్ని బట్టలు కొన్నాడు. కొంత వంటసరుకు కొన్నాడు. అవి తీసుకుని దైవప్రవక్త(స) గారి వద్దకు వచ్చాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: నీవు ప్రళయదినం నాడు నీ ముఖంపై ఇతరులను సహాయం చెయ్యమని అర్థించని గుర్తుతో నీవు రావటం ఉత్తమం కాదా? అని ప్రశ్నించారు.

ఒకసారి దైవప్రవక్త(స) గారు ఆయన(స) గారి ఒక అనుచరుని ఇంటి ముందు నిలబడి ఉన్నారు. అంతలో అక్కడి నుంచి ఒక వ్యక్తి వెళ్ళాడు. అక్కడ నిలబడి ఉన్న ఇతర ప్రజలు అతని గురించి ఓ దైవప్రవక్తా(స)! ఇతను రాత్రి పగలు దైవారాధనలోనే నిమగ్నమై ఉంటాడు అని అన్నారు. దైవప్రవక్త(స) అయితే అతని భోజన ఏర్పాట్లు ఎవరు పూర్తి చేస్తారు అని అడిగారు. దానికి ప్రజలు అతని సోదరుడు అతని అవసరాలన్నీ పూర్తి చేస్తాడు దైవప్రవక్తా(స)! అని అన్నారు. దానికి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: అయితే ఆరాధనాపరుడైన ఈ వ్యక్తి కంటే కూడా అతని అవసరాలు తీరుస్తున్న అతని సోదరుడే ఉత్తముడు. పుణ్యాలు అతనికే ఎక్కువగా లభిస్తాయి. ఎందుకంటే హలాల్ సంపాదన చెయ్యటం కూడా ఉత్తమ ఆరాధనే. అవసరాలకు ఇతరులపై ఆధారపడి ఆరాధనలో నిమగ్నమై ఉండటం ఎంత మాత్రమూ సమంజసం కాదు.

ఒకసారి ఒకతను నేను ఆకలిగా ఉన్నాను అన్నం పెట్టండి అని కేకవేసి అర్థిస్తున్నాడు. అతని కేకలను విని హజ్రత్ ఉమర్(ర) అతనికి అన్నం తినిపించమని ఆజ్ఞాపించారు. అతను కడుపు నిండా భోజనం చేశాడు. ఆ తరువాత కొద్దిసేపటికే మరొకచోట అలాగే అర్థిస్తున్నాడు. అతని కేకలను విని హజ్రత్ ఉమర్(ర) అతనిని పిలిచి అతని సంచిలో చూశారు. రొట్టెలతో ఆ సంచి నిండిపోయి ఉంది. ఆ సంచి తీసుకెళ్ళి ఒంటెల ముందు ఆ రొట్టెలన్నీ వేసేశారు. ఇంకా ఇలా అన్నారు: నీవు అగత్యపరుడవు కాదు. నీవు ఒక వ్యాపారివి.

దైవప్రవక్త(స) అవసరం లేకుండా చెయ్యి చాచి అడిగేవారిని ఎంతమాత్రమూ ఇష్టపడేవారు కాదు. అసహ్యించుకునేవారు. కష్టపడి సంపాదించి తినేవారంటే దైవప్రవక్త(స) ఎంతో ఇష్టపడేవారు. దైవప్రవక్త(స) గారి ఒక అనుచరుని చేతులు కష్టపడిన కారణంగా గట్టిపడిపోయాయి. కాయలు కాసిపోయాయి. దైవప్రవక్త(స) ఒకసారి ఆ అనుచరుని చేతులను సంతోషంగా ముద్దాడారు.

హజ్రత్ హసన్ బస్రీ (ర) గారితో ప్రజలు ఇలా అడిగారు: ఒకతను ఫరజ్ నమాజ్ జమాఅత్‌తో చేసినట్లయితే ఆ రోజు అతను ఇతరుల ముందు చెయ్యి చాచి అర్థించవలసి ఉంటుంది. అయితే అతను ఏమి చెయ్యాలి? దానికి ఆయన (రహ్మ) అప్పుడు అతను కష్టపడి పనిచెయ్యడానికి వెళ్ళిపోయి ఒంటరిగా నమాజు చేసుకోవటం ఉత్తమం అని సమాధానమిచ్చారు.

ఒక వ్యక్తి అల్లాహ్‌పై నమ్మకం ఉంచకుండా అల్లాహ్ పేరుతో దానం చేయండి అని ఇతరుల ముందు చెయ్యి చాచి అడిగేవాడు అల్లాహ్‌చే శపించబడతాడు.

హజ్రత్ ఉమర్(ర) ఇలా సెలవిచ్చారు: ఒక మనిషి మస్జిద్‌లో ఆరాధనలో కూర్చొని ఉపాధిని ప్రసాదించు అని వేడుకుంటూ ఉండటం, ఇస్లామ్ సంప్రదాయానికి విరుద్ధం. ఆకాశం వెండి, బంగారాల వర్షాన్ని ఎంతమాత్రం కురిపించదు అని మీకు తెలుసు.

ఒకవైపు అగత్యపరుల అవసరాలు తీర్చటం మహా పుణ్య కార్యంగా ఖుర్ఆన్ ప్రకటిస్తోంది. మరొకవైపు అనవసరంగా ప్రజల ముందు తన అవసరాలను ప్రకటించి అర్థించటం ఎంత మాత్రమూ మంచిది కాదని ఇస్లామ్ ధర్మం బోధిస్తోంది. ❖



# అన్నదాత సుఖీభవ!

- తహూరా సిద్దీఖా

గాలి, నీరు, ఆహార ధాన్యాలు మనిషి అవసరాలు. ఇవి లేకపోతే మనిషి బ్రతికి బట్టకట్టడం కష్టం. అయితే గాలి, నీరు ప్రత్యక్షంగా దేవుని అధీనంలోనే ఉన్నాయి. పైనుండి వర్షం కురవడం, భూగర్భ జలాలపై దేవునిదే పూర్తి అధికారం. ఇందులో మానవ మాతృడికెలాంటి ప్రమేయమూ లేదు. పైవాడి ఆజ్ఞలేనిదే ఒక్క చుక్క నీరు కూడా కురవదు. గాలి, నీరు మనదాకా అందడానికి మన ప్రమేయం లేకపోయినా ఆహారం కోసం శ్రమించాల్సి ఉంటుంది. ఆహార పంటలు, పాడిపంటలు ఇవి రెండూ మన జీవితానికి ముఖ్యమైన ఆధారం. దుక్కిదున్ని, విత్తనాలు చల్లి, అవి మొలకెత్తి ఏపుగా పెరిగి, ఆహారధాన్యాలు పండితే వాటిని మనం ఆహారంగా తీసుకుంటాం. భూమిలోపల నాటే విత్తులు మొలకెత్తేలా చేసి పంటపండేలా చేయడం దేవుని అద్భుతమేమరి. సాగు చేసే రైతన్నలు నిజంగా ప్రాణకోటికి శ్రేయోభిలాషులు. అందుకే రైతన్నను అన్నదాత అని కీర్తిస్తాము. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో సంపద ఉత్పత్తికి రైతులే మూల కారకాలు. అందుకే మనదేశంలో రైతన్నను 'జై కిసాన్' అంటారు. చదువులతో నిమిత్తం లేకుండా సాగుచేసి ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు.

మే, జూన్ నెలల్లో నిప్పులు చెరిగే ఎండల్లోనూ, డిసెంబర్, జనవరి నెలల్లో ఎముకలు కొరికే చలిలో అన్నదాత చెమటోడ్చి తిండి గింజలు పండిస్తాడు. తీరా పండించిన పంట చేతికొచ్చేసరికి పంట దిగుబడి లేక, ఉన్నా సరైన ధర రాక ఆరుగాలం శ్రమించిందంతా వేరొకరి పాలవుతుంది. అందుకే కొన్నేళ్లుగా ఊళ్లలో చేసే వ్యవసాయం కలసిరాక ఎకరాల్లో ఉన్న పొలాలను వదిలేసి పట్టణాల్లో కూలీలుగా మారుతున్నారు. ఏటీఎం సెంటర్లలో, ఇతరత్రా కంపెనీల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసుకుని బ్రతుకుతున్నారు. అన్నం మెతులు పెట్టే రైతన్న దుస్థితి ఇంత అధ్వాన్న స్థితికి కారణం మన పాలకుల విధానాలే . దశాబ్దాలుగా జరుగుతున్న రైతు ఆత్మహత్యలు తీవ్రంగా కలచివేస్తున్నాయి. రైతులను ఆదుకోకుండా ప్రభుత్వాలు రైతన్నలకు నష్టాన్ని చేకూర్చే చట్టాలనే తీసుకొస్తున్నాయి.

## వ్యవసాయానికి పెద్దపీట వేసే ఇస్లామ్ బోధనలు..

వ్యవసాయం రంగానికి ఇస్లామ్‌లో గొప్ప స్థానమే ఉంది. 'ఆకాశం నుంచి వర్షం కురిపించి భూమిలో రకరకాల పంటలు పండేంచే ఏర్పాటు చేసింది ఆ అల్లాహ్‌యే' అని ఖుర్‌ఆన్ చెబుతుంది.

ఎవరైనా ఒక మొక్క నాటినా లేదా పంట పండించినా ఆ పొలంలో నుంచి పక్షులు, క్రిమికీటకాలు, జంతువులు, మనుషులు వాటిని తింటే ఆ పంట పండించిన వారికి ఎంతో పుణ్యప్రదం అని చెప్పారు ప్రవక్త ముహమ్మద్ (సఅసం).

'మొక్కలు నాటడం కూడా పుణ్యప్రదమే'నంటారు ప్రవక్త.

'ఒకవేళ ప్రళయం వచ్చి మీదపడుతున్నా, మీ చేతిలో మొక్క ఉంటే నాటండి' అన్నారు ప్రవక్త.

పంటభూములను బీడు భూములుగా మార్చడాన్ని ప్రవక్త (స) తీవ్రంగా నిరసించారు.

ఎవరి దగ్గరైనా భూమి ఉంటే సాగు చేయాలి. ఒకవేళ చేసే స్థోమత లేకపోతే తన సోదరుడికి ఇచ్చివేయాలి. కానీ దీన్ని అద్దెకు ఇవ్వకూడదు. భూమిని వ్యర్థంగా వదిలేయకూడదు. ఇలా చేయడం అల్లాహ్ అనుగ్రహాన్ని ధిక్కరించడమే అవుతుంది.

ఖలీఫా హజ్రత్ అలీ (రజి) సమక్షంలో ఒకానొక వ్యక్తి వచ్చాడు. "నేనుండే ప్రాంతంలో ఒక వ్యక్తికి చెందిన భూమి నిర్మానుష్యంగా పడి ఉంది. ఆ భూమిలో ఎంతో చెమటోడ్చి నీటి కాలువ త్రవ్వాను, పంట పండించాను. నిర్మానుష్యంగా ఉన్న భూమిని సశ్యశ్యామలం చేశాను' అని చెప్పాడు. అప్పుడు హజ్రత్ అలీ(రజి) "చాలా మంచి పని చేశావు. పంట ఫలాన్ని తృప్తిగా అనుభవించు.." అని అతను చేసిన పనిని ఎంతగానో మెచ్చుకున్నారు. ఆ భూమి ప్రభుత్వ భూమి. లబ్దిదారుడు ఆ భూమిని వినియోగంలోకి తీసుకురాకుండా అలానే వదిలేశాడు. దాంతో మరో వ్యక్తి ఆ భూమిని వినియోగంలోకి తెచ్చి సశ్యశ్యామలం చేశాడు. ఖలీఫాల పాలనలో ప్రభుత్వ భూములను సాగు చేసేందుకు రైతులకిచ్చే వారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేవారు.

శ్రమకు తగ్గ ఫలితం లభించాలన్నది ఇస్లామ్ ధర్మ బోధన. 'కూలీవాని చెమట ఆరకముందే అతని వేతనం చెల్లించాలి' అన్నది ప్రవక్త సూచన. ఆరుగాలం శ్రమించి తిండి గింజలు పండించే రైతన్నలకూ దానికి తగ్గ ప్రతిఫలం లభించాలి. మనిషికి మూడు పూటలా ఆహారాన్ని నోటికాడికి అందిస్తున్న రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం కంటే మించిన దౌర్జన్యం ఇంకేముంటుంది. పండించిన ధాన్యాలు, ఆహార పంటలు రైతు చేతిలో ఉన్నంతవరకే అత్యంత చౌకగా ఉంటాయి. రైతు చేయి దాటాక వాటి ధరలు ఆకాశాన్నంటుతాయి. ఒక్కోసారి గిట్టుబాటు ధర కాదు కదా, సేద్యానికి అయ్యే ఖర్చు కూడా చేతికి రాక చేసిన అప్పు తీర్చలేక చావే శరణ్యమనుకుంటున్నారు కొందరు రైతన్నలు. రైతు దగ్గర రూ.5లకు కొని కార్పొరేట్లు రూ.50లకు అమ్ముతున్నారు. ప్రభుత్వ విధానాలు రైతన్నను ఆదుకునే బదులు కార్పోరేట్లకే కొమ్ముకాసేలా ఉంటున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల దయాదాక్షిణ్యాల కింద రైతులు బ్రతకాల్సిన దుస్థితి ప్రభుత్వం కల్పిస్తుంది. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడటం, అన్యాయాలను నిలదీయడం కూడా ముస్లిముల ధార్మిక విశ్వాసంలో భాగమే. రైతన్నలకు మేలుచేయని కొత్త వ్యవసాయ చట్టాలను ఎదురించడం, రైతులకు మద్దతుగా నిరసల్లో పాల్గొనడం ఇప్పుడు మనందరి కర్తవ్యం. ❖


మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్
ఢిల్లీ కోసం

విరాళాల సేకరణ

ఢిల్లీలోని జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర కార్యాలయం ప్రాంగణంలోని మస్జిద్ ఇషాఅతె ఇస్లామ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత కొన్నేళ్ళుగా నమాజీల రాక పెరగడంతో మస్జిద్ ఇరుకుగా మారింది. ముఖ్యంగా జుమా నమాజ్, రమజాన్ మాసం, ఈద్ నమాజ్‌లలో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. దీంతో మస్జిద్ విస్తరణ పనులు చేపట్టాం. అల్‌హమ్దులిల్లాహ్ నాలుగేళ్ళ క్రితం ప్రారంభించిన విస్తరణ పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి. ఇన్షాఅల్లాహ్ పది వేల మంది నమాజ్ చదివే వీలుంటుంది.

రాబోయే రమజాన్ లోపే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాము.

మా విన్నపం ఏమిటంటే, మస్జిద్ విస్తరణ మహత్కార్యంలో మీరూ భాగస్వాములై గొప్ప ప్రతిఫలం పొందగలరు.

అల్లాహ్ మీకు ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక!

అకౌంట్ వివరాలు

చెక్‌పై కేవలం **"Ishaat-e-Islam Trust"** అని మాత్రమే వ్రాయండి

**ISHAAT-E-ISLAM TRUST**

**A/c No. 1447308306**
**IFSC Code : CBIN0282953**

**Central Bank of India,**
**Sukhdev Vihar, New Delhi**

# ఇది కూడా లోభత్వమే

- ఆలియా బిన్తే మునీర్ (షర్ఫియ)

సంకుచిత మనస్తత్వం గల వారు అందరినీ దూరం చేసుకుంటారు. దీనికి భిన్నంగా విశాల హృదయం కలవారు ఇటు సమాజంలోనూ అటు కుటుంబంలోనూ అందరికీ అత్యంత ప్రియమైన వారిగా మారతారు. ఇహపరలోకాల్లో సాఫల్యం కావాలని కోరుకునే వారు కురచ బుద్ధిని వీడి విశాల హృదయాన్ని అలవర్చుకోవాలి. ఉదార స్వభావం గల వ్యక్తులు మంచితనానికి, పుణ్యకార్యాలకు దగ్గర సంబంధం కలిగి ఉంటారు. పెద్దరికాన్ని ప్రదర్శించరు. గొప్పలు చెప్పుకోరు. ఎవరైనా పొగిడినా సంబరపడిపోరు. వారి స్వభావంలో కఠినత్వం ఉండదు. నిస్వార్థంగా స్నేహం చేస్తారు. విమర్శలకు కృంగిపోరు. ఉదార మనస్తత్వంతో మెలగాలంటే మనస్సాక్షిని అదుపులో పెట్టుకోవాలి. విశాల మనస్కులు ఎప్పుడూ లోభత్వాన్ని ప్రదర్శించరు. వారిలో దాతృత్వ గుణం మెండుగా ఉంటుంది. అయితే దాతృత్వ గుణాన్ని చూపించుకోవడానికి ధనమే ఉండవలసిన అవసరమూ లేదు. తోటి వ్యక్తుల మంచిని, మేలును కోరుకునే మనస్తత్వాన్ని కలిగి వుండటం కూడా అత్యవసరం. ఉన్నత వ్యక్తిత్వం లోభత్వానికి వ్యతిరేకం. వాస్తవానికి హృదయ లోభత్వం నుండి రక్షించబడిన వారే సాఫల్యం పొందేవారు అంటుంది ఖుర్‌ఆన్.

ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తి ఇతరుల సామర్థ్యాలను గౌరవిస్తాడు. కానీ సంకుచిత బుద్ధిగలవారు ఇతరులను చిన్నచూపు చూడటంలో తన ఆనందాన్ని వెతుక్కుంటారు. దాంట్లోనే తృప్తి చెందుతారు. మానవ సమాజ మేలు కోరేవారిని ఇంకా మంచి మనుషుల విలువను వారి హోదాను లెక్క చేయకుండా వారి బ్రతుకు దారులు మూసివేయడం అనేది సమాజ వినాశనానికి దారి తీస్తుంది. ప్రవక్త కాలంలో సత్యతిరస్కారులు, బహుదైవారాధకులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి గౌరవ ప్రతిష్టలను తీవ్ర భంగం కలిగించేవారు. అవహేళన చేసేవారు. ఆయన ఉత్తమ వ్యక్తిత్వంపై బురదజల్లేవారు. కించపరుస్తూ మాట్లాడేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో వాదులాడేవారు. ఒకరిపై బురదజల్లడం, కించపర్చడం, హేయమైన చర్య కాకపోతే ఇంకేంటి? ఒకరి గౌరవ మర్యాదలను దోచుకోవడం ఒకరి సంపదలో హెచ్చుతగ్గులు చేయడం కంటే ఘోరపాపం మరొకటి లేదని ఖుర్‌ఆన్ హెచ్చరిక.

సుహైల్ బిన్ అమ్ర్ ఒక ఖురైషీ సర్దారు. మక్కా నగరంలోని అత్యంత ధనవంతులలో ఒకరు. ఈయన ఇస్లాం, ప్రవక్త (స)వారికి వ్యతిరేకంగా ప్రసంగాలు చేసేవారు. బద్ర్ యుద్ధంలో ఖైదీగా పట్టుబడ్డారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ప్రవక్త (స)తో అతను ఇంకెప్పుడు విషపూరిత ప్రసంగాలు చేయకుండా అతని నోటిలోని ముందు రెండు పళ్ళు విరగొట్టేందుకు అనుమతి కోరారు. అప్పుడు ప్రవక్త 'అతనిని విడిచిపెట్టండి. ఏదో ఒక రోజు అతని సామర్థ్యాలు ఇస్లాం కోసం పనికి వస్తాయి' అన్నారు. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) కాలంలో ధర్మభ్రష్టత్వ (ఇర్‌తిదాద్) ఉపద్రవం జోరుగా ఉండేది. ఆ సమయంలో ముస్లిం సముదాయాన్ని ఐక్యంగా ఉంచడంలో హజ్రత్ సుహైల్ బిన్ అమ్ర్ (రజి) ఉపన్యాసాలు చాలా సత్ఫలితాన్ని ఇచ్చాయి.

"ప్రవక్తా ! మంచి - చెడు ఒకటి కావు. నీవు చెడును శ్రేష్టమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుత్వం కలవాడు నీకు ప్రాణస్నేహితుడు అయిపోవడం నీవు గమనిస్తావు. ఈ సుగుణ యోగం సహన శీలురకు తప్ప మరెవరికీ లభ్యం కాదు. ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవ్వరికీ దక్కదు" (దివ్య ఖుర్‌ఆన్ హామీమ్ సజ్దా:34,35). ❖

రాజకీయ రంగంలో మునుపెన్నడూ ఇలాంటి విచిత్ర సంఘటన చోటు చేసుకుని ఉండదు. భార్య, తన భర్తకు ఇష్టమైన పార్టీతో విభేదించి వేరే పార్టీలో చేరింది. ఆ వెంటనే ఆమెకు తన భర్త నుంచి విడాకుల బెదిరింపులు మొదలయ్యాయి. వివరాల్లోకి వెళితే...

సౌమిత్రాఖాన్ పశ్చిమ్‌బంగ బీజేపీ పార్లమెంట్ సభ్యునితోపాటు అక్కడి యూత్‌వింగ్ అధ్యక్షుడూను. ఈయన భార్య అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)పార్టీలో చేరిన కొన్ని గంటల్లోనే ఒక కాన్ఫరెన్స్‌లో తన భార్య సుజాతా మండల్‌తో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించడం గమనార్హం.

ముస్లిమ్ మహిళలపై దౌర్జన్యం జరుగుతుందని బీజేపీ ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్‌పై చట్టం చేసింది. తాము ముస్లిమ్ మహిళల సానుభూతిపరులమని ప్రకటించుకుంది. మరి అలాంటి పార్టీ ఎంపీ భార్యకు ఆమెకు ఇష్టమొచ్చిన పార్టీలో చేరడం, ఆమె సిద్ధాంతాలకు అనుగుణంగా ఉన్న పార్టీకి మద్దతు పలికే స్వేచ్ఛా, అధికారం లేకుండాపోయాయి. తనకు ఇష్టమైన పార్టీలో చేరినందుకు గాను భర్త నుంచి బెదిరింపులు వచ్చాయి. వివాహ బంధం తెగతెంపులు చేసుకునేదాకా విషయం వెళ్ళింది. స్వయంగా సుజాతా మండల్ బీజేపీ ద్వంద్వ వైఖరిని ఎండగట్టింది. మీడియా ముందు ఆ పార్టీ నేతలను నిలదీసింది. నా భర్త మీడియా ముందు విడాకులిస్తానని బెదిరిస్తుంటే ఎందుకు మౌనం వహిస్తున్నార'ని దుయ్యబట్టింది. 'బీజేపీ ఒకవైపు ముస్లిమ్ మహిళల పట్ల సానుభూతి చూపుతున్నట్లు ప్రకటించు కుంటుంది. ట్రిపుల్ తలాఖ్ నిషేధంపై క్రెడిట్ తీసుకుంటుంది. కాని మరోవైపు స్వయంగా ఆ పార్టీ ఎంపీ ఐన నా భర్త కేవలం నేను తృణమూల్ కాంగ్రెస్‌లో చేరినందుకు మీడియా ద్వారా నాకు విడాకులిస్తానని బెదిరించడం ఎక్కడి న్యాయం? ఎంతవరకు సబబు?' అని ప్రశ్నించింది. "నేను ఒక మహిళను. నాకూ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. నా ఇష్టంతోనే తృణమూల్ కాంగ్రెస్‌లో చేరాను. ఈ కారణంగా నా భర్త నా నుండి వేరు కావాలనుకోవడం నాకు ఆశ్చర్యంగా అనిపిస్తుంద'న్నారు.



# బీజేపీ నేత విడాకుల బెదిరింపు

"వైవాహిక జీవితం వేరు, రాజకీయం వేరు. కాని నా రాజకీయ జీవితం కారణంగా నాకు విడాకులు లభిస్తుంటే దానికంటే విచారకరమైన విషయం ఏదయినా ఉంటుందా?" అని ఆమె ఆవేదన చెందారు.

మహిళల గౌరవం, మర్యాదల గురించి మాట్లాడే బీజేపీ నేతలు ఇప్పుడు ఎక్కడికెళ్ళారు? ❖



# విద్వేష వాతావరణం దేశానికి చేటు

దేశంలో పెరుగుతున్న విభజన వాదాన్ని అంతమొందించి శాంతి, సామరస్యాలు నెలకొల్పడానికి ప్రజా ఉద్యమం అవసరమని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షులు సయ్యిద్ సఆదతుల్లాహ్ హుసైనీ అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లో మైనార్టీల పట్ల జరుగుతున్న హింస, రైతుల నిరసనలపై చర్చించారు. దేశంలో విభజన వాతావరణం సృష్టిస్తున్నారని, దానికోసమే మత విద్వేషాన్ని పెంపొందించే చట్టాలు తీసుకువస్తున్నారని అన్నారు. యూపీ పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. మధ్యప్రదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న హింస గురించి మాట్లాడారు. అక్కడినుంచి వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తుంది. అయితే మా ఫ్యాక్ట్ ఫైండింగ్ బృందాలు సకాలంలో అక్కడికి చేరుకున్నాయి. అతి త్వరలోనే అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పిస్తామన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో ఉపాధ్యక్షులు ఇంజనీర్ సలీమ్, మీడియా సెక్రెటరీ సయ్యిద్ తన్వీర్ అహ్మద్, షరీఅ కౌన్సిల్ సెక్రెటరీ రజియుల్ ఇస్లామ్ నద్వీ పాల్గొన్నారు.




# సైన్స్- మతం

'సైన్స్ లాభాలు- నష్టాలు', 'టెక్నాలజీ సరైన వాడకం', వంటి అంశాలపై స్కూళ్ళలో వ్యాసరచన పోటీలు జరుగుతూ ఉంటాయి. దీని ఉద్దేశ్యం విద్యార్థులలో సైన్స్- టెక్నాలజీ గురించిన స్పృహను జాగృతం చెయ్యడం అయి ఉంటుంది. ఇందులో భాగంగానే "మానవుడు ఒక సామాజిక జంతువు" అనే వాక్యం కూడా మనం తరచూ వింటూ ఉంటాము. మనిషిని 'జంతువు' అని సైన్స్ ఎందుకు కన్ఫ్యూజ్ చేస్తోంది. మానవుడిలో జంతువులతో కొన్ని పోలికలు ఉన్నాయన్నది వాస్తవమే! కాని వాటి ఆధారంగా మనిషి ఒక జంతువు అని భావించడం తెలివి తక్కువతనం అవుతుంది.

సైన్స్ మనిషికి సామాజిక అవసరం. సైన్స్ ఆవిష్కరణలను ఉపయోగించి టెక్నాలజీని అభివృద్ధి చేసుకుని మనిషి తన జీవితాన్ని సులువుగా మార్చుకుంటాడు. అందువలన సైన్స్‌ను సామాజిక అవసరాలు తీర్చుకునేంత వరకే ఉంచితే సరిపోయేది. కానీ సైన్స్‌ను, ఫిలాసఫీని వేరుపరచి సైన్స్‌ను సామాజిక అవసరాలను తీర్చే స్థానం నుండి సాంస్కృతిక సమస్యల అగోచర పీఠంపై కూర్చోబెట్టేశారు. దీని పర్యవసానంగా కేవలం ఫిలాసఫీ, మతానికి సంబంధించిన ప్రశ్నలు సైన్స్ ప్రశ్నలైపోయాయి. ఆ ప్రశ్నలకు జవాబులు ఇదివరకు మతం, మతపరమైన పుస్తకాలు ఇస్తూ ఉండేవి. ఉదాహరణకు కొన్ని ప్రశ్నలు.

➢ విశ్వం ఎలా ఉనికిలోనికి వచ్చింది? ఇది దానికదే ఉనికిలోకి వచ్చిందా లేదా దీన్ని సృష్టించిన వాడు ఎవరైనా ఉన్నాడా?
➢ మనిషి ఎలా ఉనికిలోకి వచ్చాడు? ఇతర జంతువుల వలే పరిణామం చెందుతూ ఉనికిలోకి వచ్చాడా?
➢ సృష్టి అంతమైపోతుందా? తిరిగి సృష్టించబడుతుందా?
➢ మనిషి, ఇతర జీవులకు మధ్య భేదమేమిటి? మనిషి కూడా ఇతర జంతువులలాంటి జీవేనా?
➢ జ్ఞానం లేదా తెలివి అంటే ఏమిటి? ఈ జ్ఞానం మనిషికే ప్రత్యేకమా? ఇతర జంతువులకూ ఉంటుందా?
➢ బుద్ధీ, అన్వేషణల ప్రాముఖ్యత ఏమిటి? బుద్ధి కేవలం శాస్త్రజ్ఞులకే సొంతమా?
➢ ఫీలింగ్స్ ఎక్కడి నుండి పుట్టుకొస్తాయి? ఫీలింగ్స్ అనేవి కేవలం రసాయన చర్యలేనా?
➢ సహజం, కృత్రిమం మధ్య భేదానికి కారణం ఏమిటి? వీటి యదార్థమేమిటి?
➢ ఆత్మ అంటే ఏమిటి? ఆత్మ అనేది కేవలం సంధానకర్తేనా?

ఈ ప్రశ్నలు మానవుని మెదడును ఆది నుండి నేటివరకూ తొలుస్తూనే ఉన్నాయి. సైన్స్, మతం, సమాజం అనే కఠినమైన అంశంలో ముందుకు సాగే ముందు ఇందులో గల మూడు అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

## సైన్స్ అంటే ఏమిటి?

**1) సైన్స్ అనేది ఒక క్రమపద్ధతిలో ఉంటుంది. ఇది స్థిరంగా ఉండదు :** సైన్స్ అనేది పరిశీలన, అనుభవం, ఫలితం క్రమాన్ని అనుసరిస్తుంది. శాస్త్రవేత్త పరిశీలనతో ఒక భావనను (హైపోథీసిస్)ను ఏర్పరచుకుంటాడు. ఆ భావనను నిరూపించు కునేందుకు అనేక రకాలుగా ప్రయోగాలు జరుపుతాడు. చివరకు ఏం ఫలితమొచ్చిందో పోల్చి చూసుకుంటాడు. ఈ పరంపర ఈ విధంగా ఉంటుంది. పరిశీలన→ భావన→ ప్రయోగం (అనుభవం)→ ఫలితం→ (అందులో ఉద్భవించిన) కొత్త ప్రశ్నలు→ వాటి ప్రమాణాలు→ పరిశీలన.

అంటే మొదటి పరిశీలన నుండి చివరకు కొత్త పరిశీలనల వైపునకు శాస్త్రజ్ఞుడు దృష్టి సారిస్తాడు. సృష్టి, మానవుని ఉనికి గురించి ఉద్భవించే ప్రశ్నలకు సైన్స్ అసంపూర్ణ జవాబులను, బలహీనమైన జవాబులనిస్తుంది. ఉదాహరణకు చార్లెస్ డార్విన్ ఒకే జాతి పక్షుల ముక్కుల్లో గల తేడాలను పరిశీలన ద్వారా గుర్తించాడు. అదే

విధంగా మనిషిలో జంతువుల్లో గల సారూప్యత లను కూడా పరిశీలించాడు. ఇలా అనేక పరిశీలనలు చేసి చివరకు ఒక సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఆయన ప్రకారం జీవం ఆవిర్భావం సరళ జీవుల నుండి మానవుడి వరకూ పరిణామం జరుగుతూ వచ్చింది. ఈ సిద్ధాంతాన్ని నిజమని నిరూపించేందుకు ఆయన తర్వాతి శాస్త్రజ్ఞులు అనేక పరిశీలనలు చేసి ఫలితాలను తెలిపారు. ప్రతి ఒక్కరి పరిశీలనా ఫలితాలు కొత్త కొత్త సవాళ్ళను ముందుకు తెచ్చాయి.

కానీ చాలా ప్రశ్నలకు సైన్స్ సరైన, నిలకడ గల సమాధానాలను ఇవ్వలేకపోతుంది. సైన్స్‌కు సంబంధంలేని ప్రశ్నలను సైన్స్ ద్వారా జవాబులు వెతకటం అనేది సైన్స్‌పై దౌర్జన్యం చేసినట్లు అవుతుంది. సైన్స్ స్థిరమైన భావనలు కలిగి లేకపోవడం అనేది దీని బలం, బలహీనత. స్టీఫెన్ హాకింగ్స్ ప్రకారం "మతం, సైన్స్‌లో ప్రాథమిక భేదం ఏమిటంటే, మతం authenticity అనగా ప్రామాణికత ఆధారంగా ఉంటుంది. కానీ సైన్స్ పరిశీలనల ఆధారంగా ఉంటుంది.

**2. సైన్స్ 'ఎలా' అనేది చెప్తుంది. 'ఎందుకు' అనేది చెప్పలేదు :**

సైన్స్ సజీవ, నిర్జీవుల మధ్య సంబంధం ఎలా ఉంది అనేది చెప్తుంది. కాని ఎందుకు సంబంధం ఉంది అనేది చెప్పలేదు. సైన్స్ ఒక పాయింట్ వరకు వెళ్ళి ఆగిపోతుంది. ఉదా॥ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఇతర గ్రహాలు, ఉపగ్రహాలు అంతరిక్షంలో తిరుగుతున్నాయి. ఎందుకు తిరుగుతున్నాయంటే, ఒక ప్రత్యేక వ్యవస్థలో కక్ష్యల్లో తిరుగుతున్నాయి. ఈ కక్ష్యలు ఎందుకు ఏర్పరచి ఉన్నాయి? ఇక్కడకు వచ్చి సైన్స్ ఆగిపోతుంది.

మరో ఉదాహరణ చూద్దాం.. ఈ విశ్వంలో మొత్తం 15 constants (స్థిరాంకాలు) ఉన్నాయి. ఈ స్థిరాంకాలను మార్చే ప్రయత్నం చేస్తే గణిత వ్యవస్థ అంతా అస్తవ్యస్తమైపోతుంది. ఈ స్థిరాంకాలు గణిత శాస్త్రంలో ఎలా స్థిరంగా ఉన్నాయి అన్నది మనకు తెలుస్తుంది. కాని అవి 'ఆ విధంగానే' స్థిరంగా ఎందుకు ఉన్నాయి అనేది చెప్పలేము.

మూడో ఉదాహరణగా ఈ విశ్వంను స్థిరంగా ఉంచి ఉన్న ఎలక్ట్రోమాగ్నేటిక్ శక్తిలో కోటి వంతు తక్కువగా ఉన్నా ఈ గ్రహాలు, నక్షత్రాల స్వరూపమే ఉండేది కాదు. ఇది అంతే కోటి వంతు ఎక్కువగా ఉన్నా కూడా బిగ్ బ్యాంగ్ తర్వాత బిగ్ క్రంచ్ అయిపోయి ఉండేది. అంటే విశ్వం ఏర్పడగానే అంతమైపోయేది.

**3. సైన్స్ మంచి- చెడు, సత్యం- అసత్యం గురించి వాదించదు**

సైన్స్ అనేది మతం, సమాజం, వ్యక్తిగత, మనస్తత్వాలకు అతీతంగా ఉంటుంది. సైన్స్‌కు సాంస్కృతికపరమైన మంచి, చెడు, సత్యం, అసత్యం అనే ప్రమాణాలతో కొలవడం సరైనదికాదు. సైన్స్ చరిత్రను మనం గమనించినట్లయితే పరమాణు శక్తిని శాస్త్రవేత్తలు అసంకల్పితంగా కనుగొనలేదు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత మంచి ఆయుధాలు తయారు చేయాలని శాస్త్రవేత్తలకు ప్రత్యేక ఆదేశాలిచ్చి, ఆ ప్రయోగాల ఫలితంగా న్యూక్లియర్ బలాల రహస్యాలు ఛేదించి మానవ చరిత్రను కలుషితం చేసి సిగ్గుతో తలదించుకునేలా చేశారు.

ఈ విధంగానే డార్వినిజం, దానికి సంబంధించిన సిద్ధాంతాలను అర్థం చేసుకోవచ్చు. విజ్ఞానం, అన్వేషణలపై చర్చల నిఘా ఉండింది. దీని ప్రభావం ఆనాటి సైన్స్ సిద్ధాంతాలపై, శాస్త్రవేత్తలపై ఉండింది. అందువలన సైన్స్ దృష్టిలో 'మతం ఒక రోత' విసుగు కలిగించే అంశం లేదా 'మతం ఒక శత్రువు'. ఈ భావన ఆనాటి కాలంలో ఉద్భవించిందే!

మూడు వాస్తవాలు : సైన్స్ గురించి మనం మూడు వాస్తవాలను తెలుసుకోవటం చాలా అవసరం.

1. సైన్స్ అనేది స్థిరమైన వాస్తవం వరకూ తీసుకుని వెళ్ళే దారి మాత్రమే. కానీ సైన్స్ స్వయంగా స్థిరమైనది కాదు. సైన్స్ వాస్తవాలను కొంతవరకు మాత్రమే విశ్లేషించగలుగుతుంది. అది స్వయంగా తనే వాస్తవం అని వాదించదు.

2. సైన్స్ దాని నియమాలు, అంశాలపై చిత్తశుద్ధితో నిలబడు తుంది.

3. సైన్స్ అనునిత్యం ఎదురయ్యే ప్రశ్నలకు జవాబులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంది. కానీ జవాబులు ఒక ప్రత్యేకమైన ఫ్రేమ్‌లో కుదించబడి ఉంటాయి. అందువలన సైన్స్ మత పరమైన దృక్కోణంలో ఇవ్వబడిన జవాబులతో సరితూగలేదు.

అందువలన సైన్స్, మతం, సమాజం అనే ఈ చర్చలో సైన్స్‌ను మతంగా మార్చుకోవటం అనేది అతి పెద్ద పొరపాటు అని స్పష్టమవుతుంది. అదేవిధంగా సైన్స్ ద్వారా మతపరమైన సత్యాలు, దృష్టాంతాలను నిరూపించే ప్రమాణాలు అన్వేషించటం పొరపాటు అవుతుంది. దీని వలన పొంతనలేని సమాధానాలు పొందాల్సి ఉంటుంది.

మత గ్రంథాలలో గల సత్యాలకు సైన్స్ ప్రమాణాలు తెస్తుంటారు. మతపరమైన విశ్వాసాలపై సైన్స్ ఈ విధంగా పైచేయి సాధించింది. దీనికి కారణం New atheist నూతన నాస్తికులు. వీరు తెలివిగా సైన్స్‌ను నాస్తికత్వానికి ఉపయోగించుకున్నారు. రిచర్డ్ డాకిన్స్, క్రిస్టోఫర్ డేనియల్ డినీట్, సామ్ హేరిస్ వీరిలో ప్రముఖులు. ప్రగతి సాధించటం కోసం ఇతరులను నామరూపాలు లేకుండా చేయడం కూడా తప్పు కాదు అనే భావనను ఏర్పరచుకున్నారు. ఆసక్తికర విషయం ఏమిటంటే, సైన్స్ biological altruism జీవుల పరోపకారం గురించి కూడా చెబుతోంది. అంటే ఒక జంతువు మరో జంతువుకు సహాయ పడటం గురించి అన్నమాట. అందుకే ఐన్‌స్టీన్, 'మతం లేకుండా సైన్స్ కుంటిది, సైన్స్ లేకుండా మతం గుడ్డిది' అని చెప్పినమాట వాస్తవం! ❖

కథ



# అసలయిన జీవితం ఏది?

- పి.షహనాజ్ బేగం, అనంతపురం

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అడుగు మోపినప్పట్నుంచి అసద్ మనసు ఆనందోద్వేగాలతో ఊగిపోతోంది. సుమారుగా ఏడెనిమిది సంవత్సరాల తరువాత స్వంత గడ్డపై కాలు మోపాడాయే. చుట్టుపక్కల పరిసరాలను పరికించి చూశాడు. కొత్త కొత్త కట్టడాలతో ఎంతో అభివృద్ధి చెందినట్టు కన్పించింది. మనసులోనే ఆనంద పడసాగాడు. ఇంతలో బయట తమ్ముడు సమద్ కారులో వారి కోసం వేచి చూస్తున్నట్లు మెసేజ్ వచ్చింది. గబగబా అక్కడి నిబంధనలను పూర్తి చేసుకుని బయట పడ్డారు అతను, అతని కుటుంబసభ్యులు.

అప్పటిదాకా వారి కోసమే ఎదురుచూస్తున్న సమద్ అన్నగారిని చూడగానే ఆనందంతో కౌగిలించుకున్నాడు. అన్నగారి పిల్లలను చూడటం ఇదే తొలిసారి. ఇన్నేళ్ళలో వాట్సప్ వీడియో కాల్‌లోనే చూస్తూ ముద్దులాడేవాడు. కానీ ఇప్పుడు వదినా పిల్లలను ప్రత్యక్షంగా చూస్తుండే సమద్ ఆనందానికి మేర లేకుండా పోయింది.

“పదండి.. పదండి! ఇప్పటికే ఆలస్యమైపోయింది. అక్కడ అమ్మీజాన్ ఎదురు చూస్తుంటారు. అయిదు గంటల ప్రయాణం మనం మన ఊరు చేరుకోవడానికి” అంటూ సమద్ హడావుడి చెయ్యటంతో అందరూ కారులో సర్దుకుని కూర్చున్నారు.

“ఇదిగో భాబిజాన్ (వదినా) ఆ డబ్బాల్లో అమ్మ దారిలో తినడానికి ఏవో తినుబండారాలు కట్టిచ్చింది. అవి తీసుకుని తినండి. పిల్లలకు పెట్టండి. బాటిల్‌లో నీళ్ళు కూడా ఉన్నాయి” అని చెప్పాడు.

అందరూ కారులో కూర్చునే వాటి పని పట్టారు. కారు అనంతపురం వైపు దూసుకెళ్ళింది.

◆◆◆

అసద్ మనస్సు గతం వైపు తొంగిచూడసాగింది. ఏవో జ్ఞాపకాలు తన కుటుంబం గురించినవి. తన తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం. అతనే మొదటి సంతానం. తరువాత చెల్లి, చివర తమ్ముడు. కాలేజీ చదువు పూర్తికాగానే ఏదో సంస్థలో ఉద్యోగం దొరకగానే అందులో చేరిపోయాడు. అతనితోపాటు చదువుకున్న అతని స్నేహితుల్లో కొందరు అమెరికా వంటి విదేశాలకు వెళ్ళి బాగా సంపాదిస్తూ లగ్జరీ లైఫ్‌ను అనుభవించడం గమనించాడు.

స్నేహితుల ప్రోద్బలంతో విదేశాలకు వెళ్ళాలనే యోచన బీజం అతనిలో పడింది. అంతే... ఆ ప్రయత్నంలో పడ్డాడు.

తన మనసులోని మాటను తండ్రి ముందుంచాడు. అది విని కలవరపడ్డారు కన్నవాళ్ళు. తండ్రి కొడుకుని ఉద్దేశించి, ‘బేటా, నీ నిర్ణయం మార్చుకో. మనకిక్కడ ఏమి తక్కువయిందని అక్కడికి వెళ్ళి సంపాదించాలని బయలుదేరుతున్నావు. నేను పదవీ విరమణ పొందిన తరువాత కూడా మంచి మొత్తంలో పెన్షన్ వస్తుంది. స్వంత ఇల్లు ఉంది. ఇప్పుడు కూడా మంచి జీతంతో ఉద్యోగం చేస్తున్నావు. అందరం కలిసి ఒకేచోట ఉందాము. చెల్లి పెళ్ళి కూడా చెయ్యాలి’ అంటూ నచ్చజెప్పజూశారు. కాని అసద్ పట్టు వీడలేదు. ఇక కొడుకు తన నిర్ణయం మార్చుకోడని గ్రహించి పెళ్ళి చేసేశారు.

కొన్ని నెలల తర్వాత భార్యను తీసుకుని అమెరికా వెళ్ళిపోయాడు. చూస్తుండగానే ఏడెనిమిది సంవత్సరాలు గడిచిపోయాయి. ఊళ్ళో ఎన్నో శుభకార్యాలు, అశుభ కార్యాలు జరిగాయి. కానీ దేనికీ హాజరుకాలేకపోయాడు. చివరికి స్వంత చెల్లి పెళ్ళికి కూడా రాలేకపోయాడు. తన వంతుగా కొన్ని డాలర్లను పంపిస్తూ ధనసహాయం చేస్తున్నట్లు ప్రకటించుకున్నాడు.

అక్కడే ఇద్దరు పిల్లలు పుట్టారు. తరువాత తమ్ముడి పెళ్ళి కూడా జరిగిపోయింది. అప్పుడు కూడా కొన్ని డాలర్లు పంపించి

ఊరుకుండిపోయాడు. అక్కడ లభిస్తున్న పుష్కలమైన డబ్బు, విలాసవంతమైన జీవితం అతనిని అక్కణ్ణుంచి కదిలించకపో యాయి. సంబంధ బాంధవ్యాల గురించి పట్టించుకోలేదు. మానవీయ విలువలను మరిచాడు. తన మామ, చాచాలాంటి వారు చనిపోయినా ఫోన్లలో పలకరించి తన పని ముగించు కున్నాడు. చివరికి కన్న తండ్రి మరణించినా పని ఒత్తిడిలో వున్నానంటూ ఒకసారి- ఫ్లయిట్ టికెట్స్ దొరకలేదని- మొత్తానికి తండ్రి కడచూపులకు చూసుకోవడానికి నోచుకోలేకపోయాడు.

తల్లి కన్నీటితో చేసిన వేడుకోలు, బ్రతిమాలటం ఏవీ చెవికెక్కలేదు. అప్పుడు కూడా కొంత మొత్తాన్ని పంపించి, తన బాధ్యత తీరిపోయినట్లు ఫీలయ్యాడు. ఇదంతా గుర్తుకొచ్చి అతని మనసు అదోలా అయిపోయింది.

తరువాత తేరుకుని ఊరు దగ్గరవుతున్నప్పుడు అక్కడ కన్పిస్తున్న భూములను, భవంతులను చూసి వాటి ధరలను అడిగి తెలుసుకున్నాడు అసద్. దారి వెంబడి ఆ భార్యాభర్తలిరువురు వాటి గురించి చర్చించుకోసాగారు. ఏ భూమి ఎంత ధర పలుకు తుందని. చూస్తుంటే వాళ్ళు ఇక్కడ ఆస్తులు కొనడానికి వచ్చినట్ల నిపించింది సమద్‌కు. అమెరికాలో కూడా బోలెడు ఆస్తులు సమకూర్చుకున్నట్లు తెలిసింది.

అసద్, తన తమ్ముణ్ణి కూడా అమెరికాకు పిలిపించుకోవాలని ప్రయత్నాలు సాగించాడు. లక్షల్లో జీతమని, లగ్జరీ లైఫ్ గడప వచ్చునని ఆశజూపాడు. కానీ ఆ ప్రలోభాలకు లొంగలేదు సమద్. తనకు వచ్చే నలభై వేల జీతంలో సుఖమయమైన, మనుగడను సాగిస్తున్నానని, తనకిక్కడ ఏ లోటూ లేదని, ముఖ్యంగా వృద్ధాప్యంలో తన తల్లిదండ్రులకు తన అవసరం ఎంతయినా ఉందని, వారి అంతిమ సమయంలో తను వారి ప్రక్కన ఉండా లని కోరుకుంటున్నానని చెప్పేశాడు.

చెప్పినట్లుగానే సమద్ తన కన్నవారి చెంతన ఉంటూ వారికి అందుబాటులో ఎప్పుడూ ఉంటూ తన భార్యాబిడ్డలతో గడుపుతున్నాడు. తండ్రి అంతిమ ఘడియల్లో కూడా సేవలు చేస్తూ తల్లికి ధైర్యవచనాలు చెబుతూ కొడుకుగా తన బాధ్యతలను నిర్వర్తించాడు. అందరికీ ప్రీతిపాత్రుడయ్యాడు.

◆◆◆

చాలాకాలం తరువాత వచ్చిన కొడుకును, కోడలిని, మనవళ్ళను చూసి ఆ తల్లి ఆనందానికి మేరలేకుండా పోయింది. ఒకవైపు ఆనందం, మరోపక్క దుఃఖంలో ఊగిపోయిందా తల్లి. అందరినీ ఒకేసారి అక్కున చేర్చుకుని ముద్దాడింది. అపారమైన ప్రేమను రాగాలను కురిపించింది. ఊరికి వచ్చి రోజులు గడిచేకొద్దీ అసద్‌లో ఏదో అసంతృప్తి, అనిశ్చితి, అసహనం చోటు చేసుకో సాగాయి. ఏదో పోగొట్టుకున్న భావన.

తను సంపాదించిన సంపదను చూసి ఊరిలోని, తమ బంధు మిత్రులందరూ, తన రాకకై ఎదురుచూస్తుంటారని, తను వచ్చీ రాగానే అందరూ చుట్టుముట్టుతారని ఆశించాడు. కాని అక్కడ తనకు గుర్తింపు లేదని గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు. వచ్చిన వాళ్ళందరూ తమ కష్టసుఖాలను తమ్ముడితో చెప్పుకో వటం, అతనికీ అతని భార్యకు విలువ ఇవ్వటం జరిగిపోతోంది. ఒకరో ఇద్దరో ముఖస్తుతి కోసం మాట్లాడినా 'ఏమేయ్. అమెరికా నుంచి మా కోసం ఏమి తెచ్చావు' అంటూ పలకరిస్తున్నారు.

ఊళ్ళో ఎక్కడికి వెళ్ళినా సమద్ వాళ్ళ అన్నయ్యగానూ, తన తండ్రి ఖాన్‌సాబ్ గారి అబ్బాయిగానూ గుర్తించబడుతున్నాడు తప్ప తనని ఎవరూ గుర్తించటం లేదు. తను అందరినీ వదులు కుని వెళ్ళిపోలే, తనను అందరూ వదిలేశారన్న యదార్థాన్ని గ్రహించాడు. తల్లి సైతం ఇంట్లో ఏ సమస్య వచ్చినా తమ్ముణ్ణీ లేదా అతని భార్యతోనూ సంప్రతించటం గమనించాడు. తనకు తన కుటుంబానికి ఇసుమంత విలువ లేదని తెలుసుకున్నాడు. తనే ఆ విలువను పోగొట్టుకున్నాడు.

తమ్ముడు ఊరిలో ఎంతో గౌరవ ప్రతిష్ఠలను సంపాదించు కున్నాడని అర్థమయింది. తమ్ముడు, అతని భార్య ఒక సంస్థను స్థాపించి ఎంతో మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. తమ్ముడి భార్య అమీన్ ఒక చిన్న స్కూల్‌ను నడిపిస్తూ పేద విద్యార్థులకు ఉచితంగా ధార్మిక విద్యను బోధిస్తున్నది.

ఇదంతా చూసిన అసద్ తానెంత స్వార్థపరుడో తెలిసి వచ్చింది. తను సంపాదించిన సంపద అంతా తృణప్రాయంగానే కన్పించ సాగింది. మనిషికి ఆశలు ఉండటం తప్పుకాదు. అది సహజం. కానీ ఆ ఆశలు హద్దు మీరకూడదు.

ఇప్పుడు తన తమ్ముడి కుటుంబానికి ఏం తక్కువయిందని? మంచి ఇంట్లో నివసిస్తున్నాడు. మంచి తిండి తింటున్నాడు. ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నాడు. బంధు జనంతో కలిసి మానవ సంబంధాలను పెంపొందించుకుంటూ అన్ని అనుభవాలను అనుభూతులను చవిచూస్తున్నాడు. కాని తను డబ్బు తప్ప అన్నీ కోల్పోయాడు.

◆◆◆

అతను తిరిగి వెళ్ళే రోజు దగ్గర పడింది. తల్లి కొడుకు చేతులు పుచ్చుకుని "బేటా, ఇప్పటివరకు సంపాదించింది చాలు. ఇక తిరిగి వచ్చెయ్యి. నేను వృద్ధురాలయిపోయాను. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. జీవితంలో డబ్బే ప్రధానం కాదు. మానవీయ విలువలను తెలుసుకోవాలి. నీకూ వయస్సు పెరుగు తోంది. ఇక్కడ నువ్వు ఒక మహరాజులా వెలిగిపోవాలి. ఇతరుల జీవితాలలో వెలుగును నింపాలి. ఇదే నా ప్రార్థన" అంటూ చెప్పగానే సమద్ ఆ చేతులను కళ్ళకు అద్దుకుంటూ 'తప్పకుండా అమ్మీజాన్. నీ మాటను నెరవేరుస్తాను' అంటూ కన్నీటితో పర్యంత మయ్యాడు.

అసలయిన జీవితమంటే ఇదే కదా!




## మతాంతర వివాహం కాదనే హక్కు ఎవరికీ లేదు!

ఉత్తరప్రదేశ్‌లో మతాంతర వివాహం చేసుకున్న ఒక జంట రక్షణ కోసం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు వారికి అండగా నిలబడింది. మేజర్లయిన ఇద్దరు యువతీ యువకుల మధ్య జరిగిన వివాహాన్ని కాదనే హక్కు ఎవరికీ లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రేమించి పెండ్లి చేసుకున్నవారి స్వేచ్ఛను హరించే హక్కు, అధికారాలు ఇరు కుటుంబాల సభ్యులకు కూడా లేదని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ సరల్ శ్రీవాస్తవతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. మతాంతర వివాహాలను నిషేధిస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చట్టం రూపొందించిన తరుణంలో అలహాబాద్ హైకోర్టు ఇలాంటి తీర్పు ఇవ్వటం గమనార్హం. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఒక ముస్లిం యువకుడు, హిందూ యువతిని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. ఇరువురూ తాము మేజర్లమని న్యాయస్థానానికి సంబంధిత పత్రాలు సమర్పించారు. ఇద్దరి మతాలు వేరుకావటంతో వారి వివాహానికి పెద్దలు అంగీకారం తెలుపలేదు. దాంతో పెద్దల అభీష్టానికి విరుద్ధంగా గత ఏడాది ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ కుటుంబ సభ్యులు వేధించసాగారు. వివాహాన్ని రద్దు చేసుకోవాలని ఒత్తిడి చేశారు. దాంతో ఆ జంట హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బాధితులకు బాసటగా నిలిచింది. ఇరు కుటుంబాల సభ్యుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. కొన్ని రోజులపాటు ఆ జంటకు భద్రత కల్పించాల్సిందిగా స్థానిక డీఎస్పీని హైకోర్టు ఆదేశించింది.

## 'మత మార్పిడి నిషేధ' చట్టాలను సమీక్షిస్తాం




ఇటీవల ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు వేర్వేరుగా తీసుకొచ్చిన బలవంతపు మత మార్పిడి నిరోధక చట్టాల చెల్లుబాటుపై సమీక్ష జరపడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. మత మార్పిడి నిరోధక చట్టాలను సవాల్ చేస్తూ న్యాయవాది విశాల్ ఠాక్రే, 'సిటిజెన్ ఫర్ జస్టిస్ ఆండ్ పీస్' అనే ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఈ చట్టాలపై నాలుగు వారాల్లోగా సమాధానమివ్వాలని యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

## తెలంగాణలో 3724 హజ్ దరఖాస్తులు

తెలంగాణ హజ్ కమిటీకి హజ్ 2021కు గాను మొత్తం 3724 దరఖాస్తులు వచ్చాయని హజ్ కమిటీ అధ్యక్షుడు మసీహుల్లాహ్ ఖాన్ వెల్లడించారు. తెలంగాణ హజ్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నవంబర్ 7 నుంచి జనవరి 10 వరకు సాగింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ తక్కువ దరఖాస్తులు వచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కూడా కోటా పరిధి కంటే తక్కువగా దరఖాస్తులు వచ్చాయి.

## ప్రొఫెసర్ డాక్టర్ ముహమ్మద్ రఫత్ ఇకలేరు



జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్ర సలహా మండలి సభ్యులు, దిల్లీ, హర్యానా మాజీ అమీరె హల్ఖా ప్రొఫెసర్ డాక్టర్ ముహమ్మద్ రఫత్ జనవరి 8వ తేదీ శుక్రవారం కన్నుమూశారు. అస్వస్థత కారణంగా గత కొన్ని రోజులుగా దిల్లీలోని అల్ షిఫా హాస్పిటల్‌లో వైద్యం పొందుతూ తనువు చాలించారు. ఆయన మరణం పట్ల తెలంగాణ జమాఅతె ఇస్లామీ హింద్ అమీరె హల్ఖా మౌలానా హామిద్ ముహమ్మద్ ఖాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ముస్లిమ్ సముదాయానికి తీరని లోటన్నారు. ఈయన ఇటీవల జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. ఐఐటీ కాన్పూర్‌లో విద్యనభ్యసించారు. 16 యేళ్ళ పాటు దిల్లీ, హర్యానా రాష్ట్రాలకు అమీరె హల్ఖాగా సేవలు అందించారు. అంతేకాకుండా జమాఅతె ఇస్లామీహింద్ కేంద్ర సలహా మండలి అధ్యక్షులుగా, సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. జిందగీ నౌ ఉర్దూ మాస పత్రిక సంపాదకులుగా కూడా ఉన్నారు. ఈయన జమాఅతె ఇస్లామీ హింద్ మాజీ అధ్యక్షులు మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ ఉమరీ అల్లుడు. ఈయన మృతి పట్ల జమాఅతె ఇస్లామీహింద్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సఆదతుల్లాహ్ హుసైనీ సంతాపం ప్రకటించారు.

సర్వత్రా

## అమెరికా, బ్రిటన్ వ్యాక్సిన్లపై ఈరాన్ నిషేధం

అమెరికా, బ్రిటన్ కంపెనీలు తయారుచేసిన కొవిడ్-19 వ్యాక్సిన్లపై ఈరాన్ నిషేధం విధించింది. అమెరికా, బ్రిటన్ కంపెనీలు ఉత్పత్తి చేసే వ్యాక్సిన్ల దిగుమతిని నిషేధించామని ఈరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖుమేనీ ప్రకటించారు. ఆయన టెలివిజన్ ద్వారా జాతినుద్దేశించి ప్రసంగించారు."ఒకవేళ ఫైజర్ కంపెనీ వ్యాక్సిన్ ఉత్పత్తి చేస్తే అమెరికా మాకెందుకు ఇవ్వాలను కుంటోంది. వారి దేశంలో వాడుకోవాలి. అలాగే బ్రిటన్ కంపెనీ వ్యాక్సిన్ కూడా మాకొద్దు. ఆ వ్యాక్సిన్లు ఎంతమాత్రం నమ్మదగినవి కావు. గతంలో ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న రక్తంలో హెచ్ఐవీ వైరస్ ఉన్నట్లు తేలింది. కాబట్టి ఫ్రాన్స్ వ్యాక్సిన్లనూ విశ్వసించబోము" అని ఖుమేనీ అన్నారు.

## యూఏఈలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం



గల్ఫ్ దేశం యూఏఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేసింది. ఒక రోజులో 80,683 మందికి టీకా వేసినట్లు యూఏఈ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ప్రివెన్షన్ వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు వ్యాక్సిన్ తీసుకున్న వారి సంఖ్య 1,167,251కు చేరింది. మహమ్మారి కట్టడి కోసం యూఏఈ ఆరోగ్యశాఖ, దేశానికి చెందిన ప్రముఖ హెల్త్ అధికారులు సంయుక్తంగా నేషనల్ వ్యాక్సినేషన్ కార్యక్రమం కోసం పని చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రజలకు టీకాపై ఉన్న అపోహలను తొలగించి, భారీ సంఖ్యలో వ్యాక్సిన్ తీసుకునేలా ప్రోత్సహిస్తు న్నాయి. కరోనా నుంచి కాపాడేందుకు తక్కువ సమయంలో 50 శాతం ప్రజలకు టీకా ఇవ్వాలనే ఉద్దేశంతో యూఏఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తోంది.

## కార్లు లేని కొత్త నగరానికి శ్రీకారం చుట్టనున్న సౌదీ అరేబియా

సౌదీ అరేబియా నియోమ్ అనే ప్రాజెక్టులో భాగంగా "దాలాయన్" పేరుతో ఒక కొత్త పట్టణానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు వెల్లడించారు. దీనిని అధునాతన పద్ధతిలో నిర్మించ నున్నారు. అక్షరాలా రూ. 15 లక్షల కోట్లు దీనికి ఖర్చువుతోంది. ఈ నగరం 170 కీమీ కంటే ఎక్కువ పరిధిని విస్తరించి ఉంటుంది. ఈ నగరంలో కార్లు ఉండకపోవడం దీని విశేషం. ఇంట్లోంచి బయటకు వస్తే... స్కూలు, ఆస్పత్రి, సూపర్ మార్కెట్?.. ఇలా ఎక్కడికి వెళ్ళా లన్నా కాలి నడకన లేదా సైకిళ్ళపై ఐదు నిమిషాల్లోపు... గరిష్ఠంగా 20 నిమిషాల్లో వెళ్ళవచ్చు. ఇక్కడ నివసించే కమ్యూనిటీని సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించనున్నారు. దీని కారణంగా అక్కడి నివాసితులు, వ్యాపారస్తులు ప్రామాణిక జీవితం గడపగలుగుతారు. తమ దేశ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నగరాన్ని నిర్మిస్తు న్నామని వారు అన్నారు. ఈ నగరంలో మిలియన్ నివాసితులు ఉంటారని, 2030 నాటికి 3,80,00 ఉద్యోగాలను సృష్టించ నున్నారు.

## ఉర్దూలో ఐరాస న్యూఇయర్ సందేశం




ఐరాస సెక్రెటరీ కొత్త సంవత్సర సందేశాన్ని తొలిసారి యూఎన్ఓ ఉర్దూ భాషలో జారీ చేసింది. ఇదొక సంతోషదాయక వార్త. ఇప్పటి వరకు ఐక్యరాజ్య సమితి అధికార భాషలైన ఆంగ్లం, అరబీ, చైనా, ఫ్రాన్స్, రష్యా, స్పానిష్‌లలో సందేశం వెలువడేది. ఐక్యరాజ్య సమితిలో వివిధ కార్యకలాపాల కోసం, ప్రకటనలు విడుదల చేయడానికి ఈ భాషలనే ఉపయోగించేవారు. అయితే తొలిసారి సెక్రెటరీ జనరల్ అంటోనియో గుటెర్రస్ ప్రసంగాన్ని ఉర్దూ భాష లోనూ ప్రసారం చేశారు. ప్రపంచంలోని దాదాపు ప్రతి ప్రాంతంలో ఉర్దూ మాట్లాడే వారున్నారు. భారత ఉపఖండంలోని ఉర్దూ భాషావేత్తలు దాదాపు 40 కంటే పైగా దేశాలలో నివసిస్తున్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల్లోని అనేక ముఖ్యమైన నగరాలతోపాటు అరబ్బు దేశాల్లోనూ ఉర్దూ భాష బోధించడం జరుగుతోంది. కెనడా, న్యూయార్క్, లండన్, జర్మనీలో ఉర్దూ పత్రికలు, మ్యాగజైన్‌లు ప్రచురించబడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి ఉర్దూలో సందేశం విడుదల చేసిందంటే ఆ భాషకు ఉన్న ఆదరణ, ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా భారత ఉపఖండంలోని భారత్, పాక్, బంగ్లా నేతలు ఐరాస జనరల్ సెక్రెటరీ ఆంటోనియో గుటెర్రస్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఐరాస తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఉర్దూ భాష అభివృద్ధి చెందుతుందని, దానికి మరింత ఆదరణ లభిస్తుందని అన్నారు.




రువైద్

హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ కొన్ని లక్షణాలు తెలిపారు. అవి ఏ మనిషిలోనయినా ఉన్నట్లయితే అతని హృదయం ప్రాపంచిక సౌఖ్యాలలో పడిపోయి పరలోకాన్ని విస్మరించింది అని భావించవచ్చు. అలాంటి వ్యక్తి దైవ సామీప్యతకు, దైవారాధన లకు దూరం అవుతాడు. ఆ లక్షణాలేమిటో తెలుసు కుందాం:

1. మనిషి శాశ్వత విషయాల కంటే తాత్కాలిక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు. అంటే శాశ్వతంగా ఉండే పరలోకం కంటే తాత్కాలికమైన ప్రపంచానికి అధికంగా ప్రాధాన్యత ఇస్తాడు. ప్రపంచమే అతనికి సర్వస్వం అయిపో తుంది. పరలోకంలో జవాబు చెప్పుకోవాలనే భావన అతనిలో ఉండదు. అలాంటి మనిషి హృదయం అస్వస్థతకు గురైం దని భావించాలి. ఉదాహరణకు ప్రపంచంలోని ఇళ్ళు అతనికి అందంగా కనబడతాయి. కాని పరలోకంలో ఇల్లు నిర్మించుకునే విషయంలో అతను అంత ఆసక్తి చూపడు. ప్రపంచంలో గౌరవం దక్కాలని భావిస్తాడు. కాని పరలోకంలో గౌరవం పొందే విషయాన్ని పట్టించుకోడు. ప్రపంచంలో సౌలభ్యాలు దొరికితే చాలు కాని పరలోకంలో శిక్షల నుంచి బయట పడడాన్ని పట్టించుకోడు.

2. మనిషి ఏడ్వడం మానుకుంటే అతని హృదయం కఠినంగా మారిపోయిందని అర్థం చేసుకోవచ్చు. గుర్తుంచుకోండి, అప్పుడప్పుడు మనిషి కళ్ళు ఏడుస్తాయి. అంతేకాకుండా అతని హృదయం కూడా రోదిస్తుంది. మనో రోదన కంటి రోదన కంటే ప్రాధాన్యత సంతరించుకుంటుంది. కంటి నుంచి కన్నీళ్ళు రావడమే ఏడ్వడం అనుకోకండి. చాలా మంది దైవ దాసుల హృదయాలు రోదిస్తుంటాయి. కాని వారి కళ్ళ నుంచి అశ్రువులు రాలవు. వారి రోదనలను అల్లాహ్ స్వీకరిస్తాడు. వారి పశ్చాత్తాపం కోసం స్వీకార ద్వారాలను తెరుస్తాడు. మరి కొందరుంటారు. వారి కళ్ళు అశ్రుపూరితం అవుతావు. వారి హృదయమూ రోదిస్తుంటుంది.


3. జనాలతో బాగానే కలుస్తుంటారు. కాని అల్లాహ్‌తో కలవడం మాత్రం ఇష్టపడరు. అల్లాహ్‌ను విస్మరిస్తారు. అంటే దైవారాధన పట్ల వారికి అంత మక్కువ ఉండదు. అలాంటి వారి హృదయం నిర్జీవం అయిపోయిందని గ్రహించాలి. ఇలాంటి వారు జనులతో సంబంధాలు బాగానే నెరపుతారు. వారిని మాటిమాటికి కలవాలని, వారితో సమయం గడపాలని ఉవ్విళ్ళూరుతుంటారు. కాని అల్లాహ్‌ను కలవాలనే ధ్యాస వారికి ఉండదు.

4. మానవ హృదయం అల్లాహ్ స్మరణ చేయడానికి సంకోచించినప్పుడు, మనుషులతో కూర్చోవడం, కలవడంలో ఆనందం కలిగినప్పుడు హృదయం నిర్జీవమయిందని భావించాలి. ఇలాంటి పరిస్థితిలో జిక్ర్ చేయడం, తస్బీహ్ చేయడం లాంటి వాటికి మనిషి మనస్సు ఇష్టపడదు.

ఈ లక్షణాలు గనక ఎవరిలోనయినా ఉంటే, వారు వెంటనే మేల్కొవాలి. దైవ సామీప్యం పొందేందుకు ప్రయత్నించాలి.

❖

తుది గీటు



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**